# 49

# తప్పుడు ప్రోత్సాహకములు

## (20:1-34)

పందొమ్మిదవ అధ్యాయంలో మొదలైన యేసు పరిచర్య వృత్తాంతము అనగా, ఆయన పెరియ మరియు యూదయలో చేసిన పరిచర్య వృత్తాతంతమును, ఈ అధ్యాయము కొనసాగించుచున్నది. పనికి పిలువబడి ద్రాక్షతోటలో పనిచేయుటకు పంపబడిన కూలీల ఉపమానము (20:1–16), ఆసన్నమగుచుండిన యేసు మరణము గూర్చిన మూడవ ఘోషణ (20:17–19), రాజ్యములో గొప్పతనము (20:20–28), మరియు యేసు యెరికో పట్టణములో ఇద్దరు గ్రుడ్డివారిని స్వస్థపర్చుట (20:29–34) దీనిలో కలవు.

### పనికి పిలువబడి ద్రాక్షతోటలో పనిచేయుటకు పంపబడిన కూలీల ఉపమానము (20:1–16)

**1ఏలాగనగా–పరలోకరాజ్యము ఒక ఇంటి యజమానుని పోలియున్నది. అతడు తన
ద్రాక్షతోటలో పనివారిని కూలికి పెట్టుకొనుటకు ప్రొద్దున బయలుదేరి 2దినమునకు ఒక
దేనారము చొప్పున పనివారితో ఒడబడి, తన ద్రాక్షతోటలోనికి వారిని పంపెను. 3తరువాత
అతడు దాదాపు తొమ్మిది గంటలకు వెళ్లి సంత వీధిలో ఊరక నిలచియున్న మరికొందరిని
చూచి 4–మీరును నా ద్రాక్షతోటలోనికి వెళ్లుడి, యేమి న్యాయమో అది మీ కిత్తునని వారితో
చెప్పగా వారును వెళ్లిరి. 5దాదాపు పండ్రెండు గంటలకును, మూడు గంటలకును, అతడు
మరల వెళ్లి, ఆలాగే చేసెను. 6తిరిగి దాదాపు అయిదు గంటలకు వెళ్లి, మరికొందరు
నిలచియుండగా చూచి–ఇక్కడ దినమంతయు మీరెందుకు ఊరకనే నిలచియున్నారని వారిని
అడుగగా 7వారు ఎవడును మమ్మును కూలికి పెట్టుకొన లేదనిరి. అందుకతడు–మీరును
నా ద్రాక్షతోటలోనికి వెళ్లుడనెను. 8సాయంకాలమైనప్పుడు ఆ ద్రాక్షతోట యజమానుడు
తన గృహనిర్వాహకుని చూచి–పనివారిని పిలిచి, చివర వచ్చిన వారు మొదలుకొని మొదట
వచ్చినవారివరకు వారికి కూలి ఇమ్మని చెప్పెను. 9దాదాపు అయిదు గంటలకు కూలికి
కుదిరినవారు వచ్చి ఒక్కొక దేనారము చొప్పున తీసికొనిరి. 10మొదటి వారు వచ్చి తమకు
ఎక్కువ దొరకుననుకొనిరి గాని వారికిని ఒక్కొక దేనారము చొప్పుననే దొరకెను. 11వారది
తీసికొని– చివర వచ్చిన వీరు ఒక్కగంట మాత్రమే పనిచేసినను, 12పగలంతయు కష్టపడి
యెండబాధ సహించిన మాతో వారిని సమానము చేసితివే అని ఆ యింటి యజమానునిమీద
సణుగుకొనిరి. 13అందుకతడు వారిలో ఒకని చూచి–స్నేహితుడా, నేను నీకు అన్యాయము
చేయలేదే; నీవు నాయొద్ద ఒక దేనారమునకు ఒడబడలేదా? 14నీ సొమ్ము నీవు తీసికొని
పొమ్ము; నీ కిచ్చినట్టే కడపట వచ్చిన వీరికిచ్చుటకును నాకిష్టమైనది; 15నాకిష్టమువచ్చినట్టు
నా సొంత సొమ్ముతో చేయుట న్యాయము కాదా? నేను మంచివాడనైనందున నీకు**

**కడుపుమంటగా ఉన్నదా అని చెప్పెను. [16]ఈ ప్రకారమే కడపటివారు మొదటివారగుదురు, మొదటివారు కడపటివారగుదురు.**

వారు చేసిన త్యాగము మరియు సేవకు ప్రతిఫలముగా అపొస్తలులు ఏమి ఆశించవచ్చునో యని అంతకు మునుపు పేతురడిగిన ప్రశ్న, యేసు ఈ ఉపమానము చెప్పుటకు నాంది యగుచున్నది (19:27). వారికి ప్రత్యేకముగా బహు గొప్ప ప్రతిఫలమున్నదని యేసు పేతురుకు వాగ్దానమిచ్చాడు; వారు పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములకు తీర్పు తీర్చుదురు (19:28). ఇంకా ఆయన నామము నిమిత్తమును మరియు సువార్త నిమిత్తమును త్యాగము చేయు ప్రతి వానికి గొప్ప ప్రతిఫలములు కలుగునని కూడ ఆయన సెలవిచ్చాడు (19:29). తుది ఘోషణగా, "ఈ ప్రకారమే కడపటివారు మొదటివారగుదురు; మొదటివారు, కడపటివారగుదురు" అని ఆయన ప్రకటించాడు (19:30).

ఆ తరువాత యేసు ఈ సత్యమును మరొక దృష్టికోణంలో సోదాహరణముగా చిత్రీకరించుటకు పనికి పిలువబడి ద్రాక్షతోటలో పనిచేయుటకు పంపబడిన కూలీల గూర్చిన ఉపమానము చెప్పాడు (20:1–16). సేవ చేయుటకు ఒకడు కలిగియుండగల తప్పుడు ప్రోత్సాహకముల గూర్చి తన శిష్యులను హెచ్చరించుట ఆయన ఉద్దేశమై యుండినది. ఒకడు కేవలము ప్రతిఫలము కొరకు ఆశపడి మాత్రమే ఎన్నడైనను దేవుని సేవించ కూడదు. రక్షణ, కృపకు సంబంధించిన విషయమై యున్నది; ఎవడైనను దానిని వాని క్రియల చేత సంపాదించుకొనజాలడు (ఎఫెసీయులకు 2:8–10). సరికదా, ఒకడు తనను తాను ఇతర పనివారితో పోల్చుకొనకూడదు లేదా వారు దేవుని నుండి పొందుచుండు ఆశీర్వాదముల గూర్చి అసూయ చెందకూడదు.

**వచనము 1. ఏలాగనగా పరలోక రాజ్యము … పోలియున్నది** అను పదజాలము, లేదా ఇదే విధమైన పదములు, రాజ్యము ఇతర విషయములతో పోల్చబడుచుండిన వివరములుండిన ఉపమానములను పరిచయము చేయుటకు యేసు చేత తరుచుగా ప్రయోగింపబడినవి (13:24, 31, 33, 44, 45, 47; 18:23; 22:2; 25:1). ఈ సందర్భములో, పరలోక రాజ్యము ద్రాక్షతోట యజమానితో పోల్చబడుట లేదు, కానీ యజమానుడు పనివారిని పనికి పిలిచిన పరిస్థితితో పోల్చబడుచున్నది. సహజంగానే, యజమాని యొక్క కృప మరియు ఆదరాభిమానములు ఆయన ఉపదేశించుచుండిన పాఠములోని అంతర్భాగమై యున్నవి.

"పరలోక రాజ్యము," "దేవుని రాజ్యము," "నా రాజ్యము," మరియు "రాజ్యము" – ఇవన్నియును ఒకే వ్యవస్థను సూచించుచుండగా, మనము ప్రతి పదము యొక్క ఆ యా సందర్భమును గమనించవలెను. ఈ పదములు ఏదో రానైయున్న, నిత్య విషయము నొకదానిని సూచించవు, కానీ ఇప్పుడును ఉన్న దేవుని ఒక నియమమును, సూచించును. "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని" పలుకుచూ బాప్తిస్మమిచ్చు యోహాను ప్రబోధించుచు వచ్చాడు (3:2). "కాలము సంపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని" యేసు బోధించాడు (మార్కు 1:15). ఈ ఇరువురు కూడ ఒకే రాజ్యమును ప్రకటించుచుండిరి, గనుకనే వారు అది త్వరలో

రానైయున్నదని ప్రబోధించారు. "దేవుని రాజ్యము బలముతో వచ్చుట వారు చూతురని యేసు తన అపొస్తలులకు వాగ్దానమిచ్చాడు (మార్కు 9:1). ఆయన ఆరోహణముకు మునుపు, "తండ్రి యొక్క వాగ్దానము" కొరకు వారు యెరూషలేములో వేచియుండవలెనని ఇదే పదకొండు మందితో–అప్పటికి యూదా యిక లేదు–ఆయన చెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:4). వారు "యూదయ మరియు సమరయ, భూదింగతముల వరకును" క్రీస్తు కొరకు సాక్షులై యుండునట్లు ఇది వారి మీదికి దిగి వచ్చి వారిని శక్తిమంతులను చేయనైయుండిన పరిశుద్ధాత్మ బాప్తిస్మమై యుండినది (అపొస్తలుల కార్యములు 1:8). ఈ వాగ్దానము పెంతెకొస్తు దినాన నెరవేరినది (అపొస్తలుల కార్యములు 2). ఆ దినాన పరిశుద్ధాత్మ దిగి వచ్చాడు, అపొస్తలులు అద్భుతకరమైన శక్తి పొందారు, దేవుని/పరలోక రాజ్యము వచ్చింది (అపొస్తలుల కార్యములు 2:29–41; 1 కొరింథీయులకు 15:20–28; కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28–29).

**భూస్వామి** (*oikodespotēs*) అని అర్థమిచ్చు గ్రీకు పదము ఒక మిశ్రమ పదము యొక్క అనువాదమై యున్నది, "ఇంటి యజమాని" అని దాని అక్షరార్థమై యున్నది. తరుచుగా, ఉపమానములలో, ఈ పదము యేసును లేదా దేవుని సూచించుచున్నది (10:25; 13:27; 20:1; 21:33; లూకా 13:25; 14:21). ఈ పదము ధనము మరియు అధికారము గల ఒకనిని సూచించుచున్నది. ఈ ఉపమానములో, "ఇంటి యజమానికి" పనివారి పనులను పర్యవేక్షించిన (20:8) ఒక "గృహనిర్వాహకుడు" ఉండెను, కూలీలను పనిలోనికి పిలుచుటకు అతడు కూడ వ్యక్తిగతముగా చాలినంత జోక్యము గలవాడై యుండెను.

**ద్రాక్ష తోటలు** పాలస్తీనా దేశములో సామాన్యమైన దృశ్యమై యుండెను; పర్వత శ్రేణుల ప్రక్కల్లో అవి చూడముచ్చటైన దృశ్యములై యుండినవి. పాత నిబంధనలో, వాగ్దానము చేయబడిన దేశములోని సఫలత, ఒకడు తన సొంత అంజూరపు, ఒలీవ మరియు ద్రాక్షతోట కలిగియుండుటకు సమానముగా ఎంచబడినది (ద్వితీయోపదేశకాండము 6:11; యెహోషువ 24:13; 1 రాజులు 4:25; 2 రాజులు 18:31; యోవేలు 1:12; 2:22). అంతమాత్రమేగాక, ఇశ్రాయేలు కొన్ని పర్యాయములు ఎంచబడినది దేవుని ద్రాక్షవల్లి లేక ద్రాక్షతోటగా చిత్రీకరింపబడినది (యెషయా 5:1–7; యిర్మీయా 2:21; 12:10; హోషేయ 10:1). క్రొత్త నిబంధనలో, ద్రాక్షతోటలు యేసు ఉపమానములకు ఒక సుపరిచితమైన సాదృశ్యమును సమకూర్చినవి (20:1; 21:28, 33; లూకా 13:6). ద్రాక్షవల్లి లేక ద్రాక్షతోట క్రీస్తు సంఘమును సూచించుటకు కూడ ఉపయోగింపబడినది (యోహాను 15:1–11; 1 కొరింథీయులకు 9:7).

ఇంటి యజమాని **తన ద్రాక్షతోటలో పనివారిని కూలికి పెట్టుకొనుటకు ప్రొద్దున బయలుదేరెను.** రోజువారీ కూలీలు కూడుకొనుటకు సంత వీధి సర్వసాధారణమైన స్థలమై యుండినది (20:3). ఈ పనివారు, సర్వసాధారణముగా విద్యలేని మరియు నిపుణతలేని పామరులై యుండిరి, మరియు సమాజపరంగాను ఆర్థికపరంగాను అత్యంత తక్కువ స్థాయిలో ఉండిరి. వారికి చాలా తక్కువ కూలీ ఇవ్వబడుచుండినది మరియు సర్వసాధారణముగా అనాదరింపబడుచుండిరి (మలాకీ 3:5; యాకోబు 5:4). ప్రజలందరును వారి యెడల న్యాయముగా ప్రవర్తించుదురను అభయము వారికుండునట్లు దేవుడు ప్రత్యేక ఆజ్ఞలు కూడ ఇచ్చాడు (లేవీయకాండము 19:13; ద్వితీయోపదేశకాండము 24:14, 15).

కూలివారు పనిచేయు దినమంతటి సమయము మూడేసి గంటల చొప్పున నాలుగు భాగములు చేయబడినది. మొదటి నాలుగవ భాగము ఉదయం 6 గంటలకు, లేక సూర్యోదయమైనప్పుడు మొదలౌతుంది, పన్నెండు గంటలు కొనసాగుతుంది, సాయంకాలము దాదాపు 6 గంటలకు సూర్యుడస్తమించుచుండు సమయంలో ఆ రోజు ముగియును (కీర్తనలు 104:20-23; యోహాను 11:9). పనివాడు పనిచేయుటకు వాని యజమాని సమయం ప్రకారము పొలము లోనికి వెళ్లును, కానీ తన ఇష్టము వచ్చిన సమయంలో ఇంటికి తిరిగి వెళ్లునని టాల్మూడ్ సెలవిచ్చుచున్నది.[1] ఈ ఉపమానములో, కూలివాడు పొలములో పనిచేయుట మొదలుపెట్టినాడను సమయము అతడు సంత వీధిలో ఉన్నప్పుడు కూలి పనికి రావలసినదని పిలువబడినప్పుడే మొదలై, సూర్యాస్తమయ సమయంలో ముగిసింది.[2]

పాలస్తీనా దేశంలో ద్రాక్ష పంట సాగుబడి సర్వసాధారణంగా ఆగస్టు మరియు సెప్టెంబరు మాసములలో చేయబడుచుండినది, అప్పటికి వాతావరణము యింకా వెచ్చగానే ఉంటుంది (20:11-12). ఈ ప్రత్యేక దినాన పనివారిని పిలుచుటకు ఇంటి యజమాని సంత వీధికి ఐదు పర్యాయములు వెళ్లి వచ్చినట్లు అర్థమగుచున్నది (20:1, 3, 5, 6). బహుశా అతడు తన ద్రాక్ష పండ్ల కోత అంతయు ఆకురాలు కాలము నాటి వర్షములు కురియక మునుపే తన కోతను కూర్చుకొనుటకు ఆతురపడి యుండును. ఏలయనగా తొలకరి వానలు సెప్టెంబరు మాసము రెండవ భాగంలో కురుస్తూ, దీర్ఘకాల ఎండకాలమును సమాప్తిచేస్తాయి.

**వచనము 2.** ఇంటి యజమాని **దినమునకు ఒక దేనారము చొప్పున పనివారికిచ్చునని వారితో** ఒడబడ్డాడు. ఒక దేనారము, రోమా ప్రభుత్వ వెండి నాణెము, ఒక దినమునకు ఇవ్వబడిన సాధారణ వేతనమై యుండినది.[3] రోమా ప్రభుత్వ సైనికునికి కూడ ఇంతే మొత్తము చెల్లింపబడుచుండినది.[4] పనివారు ఒడబడిన పిదప, ఇంటి యజమాని తన **ద్రాక్ష తోటలోనికి వారిని పంపెను**.

**వచనము 3.** ఇంటి యజమాని దాదాపు **తొమ్మిది గంటలకు** (దినములోని రెండవ నాలుగో భాగము) మరొక పర్యాయము **సంత వీధి లోనికి** వెళ్లాడు. ఆయన సంత వీధి లోనికి వచ్చినప్పుడు, ఎవరైనా వారిని పనిలోనికి పిలిస్తే బాగుండునని **వేచియుంటూ ఊరక నిలిచియున్న** మరికొందరిని చూసాడు. ప్రాచీన ప్రపంచంలోని ప్రజలు పనిచేయుటకు తరుచుగా ఒక్కొక్కసారి ఒక రోజు కూలి పనికి పిలవబడి, దినాంతమందు ఆనాటి కూలి పొందుచుండిరి. ఈ విధంగా సంపాదించగలిగిన మొత్తము ఆ నాటి అవసరములకే సరిపోవుచుండినది (6:11). ఏదైనా ఒక దినాన వారికి కూలి పని దొరకనట్లయితే, వారి యొద్ద ఆ నాటి ఆహారమునకు సరిపడు మొత్తముండదు; కాబట్టి ఉపమానములో తెలియజెప్పబడుచున్నటువంటి కూలీలు సంత వీధులోనే ఉండిపోయి, ఎవరైనా పనికి పిలువకపోతారా అని వేచియుండెడివారు.[5]

**వచనము 4. మీరును నా ద్రాక్ష తోటలోనికి వెళ్లుడి, యేమి న్యాయమో అది మీకిత్తునని** ఇంటి యజమాని ఎంతో ఆశతో ద్రాక్ష తోటలో పనిచేయుటకు వచ్చినవారితో చెప్పాడు. గ్రీకు బాషలో, "మీరును" అను పదము నొక్కివక్కాణింపబడినది. వారు వెళ్లి, వారి కంటె మూడు గంటలు ముందుగానే పనిచేయుటకు మొదలుపెట్టిన వారితో కలిసి

పనిచేయవలెనని ఆయన వారికి చెప్పుచుండెను. "మీకు న్యాయమైన కూలి చెల్లింతును ఇవ్వవలసిన సరైన మొత్తమును నేను మీ కిత్తును" అని వ్రాయబడుటకు బదులుగా (NASB), కొన్ని ఇతర భాషాంతరీకరణములలో, "మీకు న్యాయమైన కూలి చెల్లింతును" అని వ్రాయబడి యున్నది (TEV; NEB; REB). వారికి ఇవ్వబడు మొత్తమునే అంగీకరించుటకు పనివారు ఒప్పుకొన్నారు, మరియు ఇంటి యజమానుడు వారి యెడల న్యాయముగా ప్రవర్తించునని అతనియందు నమ్మకముంచారని స్పష్టమగుచున్నది. పనిలోనికి తొమ్మిది గంటలకు వచ్చినవారు ఆరు గంటలకు వచ్చిన వారి కంటె ఆలస్యంగా వచ్చారు గనుక, వీరు దినమంతటి కూలిని ఆశించకూడదదని లియోన్ మోర్రిస్ అనుకొనుచున్నాడు. ఇంటి యజమాని వారికి ఒక దేనారములోని సరైన మొత్తమునే ఇచ్చునని వారనుకొని యుండవచ్చును.[6]

**వచనము 5.** ఇంటి యజమాని దాదాపు **పండ్రెండు గంటలకును** (దినములోని మూడవ నాలుగో భాగము), **మూడు గంటలకును** (దినములోని నాలుగో నాలుగవ భాగము), అతడు మరల వెళ్లి, ఇంకా అదనపు పనివారిని కూలికి పిలిచాడు, మరియు తొమ్మిది గంటలకు పిలువబడిన వారితో చేసిన **అదే** ఒప్పందమును వీరితో కూడా కుదుర్చుకొన్నాడు.

**వచనము 6.** తిరిగి దాదాపు **ఐదు గంటలకు** (దినములోని పదకొండవ గంట) – పనులు ముగియడానికి యింకా ఒకే ఒక్క గంట సమయము మిగిలి యున్నది – ఇంటి యజమాని సంత వీధికి మరలా వెళ్లి, మరికొందరు నిలిచియుండగా చూసాడు. **ఇక్కడ దినమంతయు మీరెందుకు ఊరకనే నిలిచియున్నారు?** అని ఆయన వారిని అడిగెను. ఈ ప్రశ్న వారి సోమరితనమునకు ఒక గద్దింపై యున్నదని లేదా, వారు ఎందుకు అలా సోమరులై ఊరకనే నిలిచియుండుటకు గల హేతువేమిటో వివరించవలెనని చేయబడుచున్న ఒక మనవియై యున్నదని కూడ అర్థం చేసికొనవచ్చును.

**వచనము 7.** అందుకు వారు, **ఎవడును** మమ్మును కూలికి పెట్టుకొనలేదనిరి. వారు పనిలోనికి వెళ్లకుండుటకు గల కారణమేమిటో వాక్యభాగము ఇంతకు మించి మనకు తెలియజెప్పుటలేదు. **మీరును నా ద్రాక్షతోట లోనికి వెళ్లుడని** ఇంటి యజమాని వారికి చెప్పాడు. 4వ వచనములో వలెనే, "మీరును" అను మాట నొక్కివక్కాణింపబడుచున్నది. వీరు కూడ ఆయన దినమంతటిలో కూలికి పిలిచిన మిగిలినవారితో కలిసి పనిచేయవలెనని ఆశించారు. ఈ సందర్భములో ఇంటి యజమాని ఎంత మొత్తమునకు ఒడబడెనో ఏమియు తెలియజెప్పబడలేదు. బహుశా, వారికి న్యాయసమ్మతమైన కూలి చెల్లింపబడునని నమ్మినందు వలననే, చివరి నిమిషంలో పిలువబడిన ఈ పనివారు సంతోషంతో అంగీకరించి యుందురు. వీరు తమ కుటుంబములను పోషించుకొనుటకు పూర్తి దిన కూలి అవసరమై యుండినప్పటికిని, బహుశా, ఇతర కూలీలకు చెల్లింపబడు మొత్తములో కనీసము కొంచెమైనా వారికివ్వబడునని వారు ఆశించి యుందురు.

**వచనము 8.** పనిచేయవలసిన పన్నెండు గంటల సమయం అనగా, సాయంకాలమైనప్పుడు ఆ **ద్రాక్ష తోట యజమానుడు** తన గృహనిర్వాహకుని చూచి, **పనివారిని పిలిచి, చివర వచ్చినవారు మొదలుకొని మొదట వచ్చినవారి వరకు కూలి ఇమ్మని** చెప్పెను. పనివారు పస్తులుండకుండునట్లు వారికి ఆ నాటి కూలి ఆ నాటి పని వేళలు ముగిసిన తరువాత చెల్లించుట అదొక ఆనవాయితీయై యుండినది (చూడు

లేవీయకాండము 19:13; ద్వితీయోపదేశకాండము 24:14, 15; మత్తయి 6:11). పని చేయుటకు మొదట పిలువబడినవారు మొదట చెల్లింపబడుదురని ఎవరైనా అనుకొంటారు. అయితే యిచ్చట తిరగ రాయబడిన వరుస క్రమము మిగిలిన ఉపమానమంతటి చర్చకు ఒక ఆధారమును సమకూర్చుచున్నది. నిర్దిష్టమైన ఈ వరుస క్రమము యోచింపబడుటకుగల ఒక నియమమును సోదాహరణంగా వర్ణించుచున్నది: "కడపటివారు మొదటివారగుదురు, మొదటివారు కడపటివారగుదురు" (చూడు 20:16; 19:30). మొదట వచ్చినవారు మరియు చివర వచ్చినవారు మాత్రమే పేర్కొనబడినప్పటికిని, వచ్చిన ఐదు గుంపులకు చెందినవారందరికిని వారి దిన కూలి చెల్లింపబడినదని తెలియుచున్నది.

**వచనము 9. దాదాపు ఐదు గంటలకు** కూలికి కుదిరినవారు వచ్చి **ఒక్కొక్క దేనారము చొప్పున తీసికొనిరి.** పని చేయవలసి యుండిన పన్నెండు గంటలలో వీరు ఒక గంట సేపు మాత్రమే శ్రమించారు, కానీ దినమంతటి కూలి తీసికొన్నారు. ఇంటి యజమాని వీరిపై ప్రదర్శించిన కనికరమునుబట్టి వీరు నిశ్చయముగా ఆయనకు కృతజ్ఞులై యుందురు. చివర వచ్చిన వీరికి దిన కూలి ఇవ్వబడుచుండగా మొదట వచ్చినవారు అచ్చట ఉండి జరుగుచుండిన దానంతటిని గమనించుచుండిరి.

**వచనము 10. మొదటి వారు** గృహనిర్వాహకుని యొద్దకు వచ్చి వారు ఆ నాటి ఉదయకాలము ఒడబడిన **ఒక దేనారము కంటె** (20:2) తమకు **ఎక్కువ దొరకుననుకొనిరి.** కానీ వారి నిరాశకు సరిపడినట్లు **వారికిని ఒక్కొక్క దేనారము చొప్పుననే దొరకెను.** గ్రీకు గ్రంథ పాఠములో, ఇతరులకు ఇవ్వబడినంతే "వారికిని" దొరకెను అని నొక్కివక్కాణింపబడుచున్నది.

**వచనము 11.** గృహనిర్వాహకుడు పనివారికి వారి కూలి మొత్తమును పంచిపెట్టుచుండగా, **ఇంటి యజమాని** అచ్చోటనే నిలువబడియుండి, జరుగుచుండిన దానినంతటిని గమనించుచుండెను. ఇంటి యజమానుడు తన ఒప్పందమును నిలువబెట్టుకొన్నప్పటికిని, పనికి మొదట పిలువబడినవారు వారికివ్వబడిన మొత్తము గూర్చి **సణుగుకొనిరి.** ఇచ్చటి గ్రీకు భాష (*gonguzō* నుండి) ఒక "onomatopoeia" అయియున్నది, అది దేనిని సూచించునో దానినే అనుకరించునట్లు ఉచ్చరింపబడుచున్న ఒక పదమై యున్నది. ఆంగ్లములో, సణుగు లేక గొణుగు అని అర్థమిచ్చు "మెటర్," "మంబల్," లేక "మర్మర్" అని చెప్పుకొనవచ్చును.[7] పనివారు తదుపరి రోజుల్లో కూడ పనికొరకు వారు ఆధారపడగల యజమానునిపై సణుగుట కొంచెము ఆశ్చర్యముగానే ఉన్నది.

**వచనము 12.** ఈ పనివారు **పగలంతయు కష్టపడి యెండ బాధ సహించినవారు,** అందరు కలిసి యజమానునిపై సణిగారు ఏలయనగా చివర వచ్చినవారు **ఒక గంట మాత్రమే పనిచేసినను** వారిని తమతో **సమానము** చేసారని సణిగారు. ఉదయం 6 గంటలకు వచ్చినవారు తమ యజమానున్ని రెండు తప్పుల విషయంలో నిందించారు. మొదటిది, ఆయన అన్యాయము చేసాడని వారన్నారు, ఏలయనగా అయన పన్నెండు గంటల సమయం చేయబడిన పనికిని, ఒక్క గంట మాత్రమే చేయబడిన పనికిని ఎటువంటి తేడా చూపలేదు. రెండవదిగా, నిర్దయాపూర్వకమైన నిర్ణయమునుబట్టి వారు ఆయనను నిందించుచుండిరి, ఏలయనగా పగటివేళ ఉండు యెండ బాధకును, సాయంకాలం వేళ ఉండు చల్లదనమునకును గల వ్యత్యాసమును ఆయన గుర్తించలేదు.[8] "పగటివేళ కలుగు

యెండ బాధ (*kausōn*) మధ్యాహ్నమందలి మండుటెండను సూచింపవచ్చును. ఏదిఏమైనా, అది తీవ్రమైన యెండబాధను కలుగజేయు తూర్పు గాలులను కూడ సూచింపవచ్చును, ఈ గాలులు "sirocco" అని కూడ పిలువబడుచున్నవి. పగటివేళ నెలకొని యుండు మండుటెండలు "కొన్ని పర్యాయములు పనివారిని పొలములలో నుండి వెలుపలికి నీడ గల చోట్లకు పరుగులుపట్టించినవి."[9]

**వచనములు 13-15.** ఈ పనివారు మర్యాదపూర్వకమైన ఎటువంటి బిరుదైనను లేకుండా ఇంటి యజమానుని సంబోధించారు (20:11-12). దీనికి విరుద్ధముగా, ఆయన **వారిలో ఒకనితో** మాటలాడినప్పుడు, ఆయన వానిని **స్నేహితుడా** (*hetairos*) అని సంబోధించుచున్నాడు. ఈ మాట కొన్ని పర్యాయములు "ఒకనికి వాడు మాటలాడుచున్న వ్యక్తి యొక్క పేరు తెలియనప్పుడు ఒక సామాన్య రూపములో" ప్రయోగింపబడినది.[10] ఇదే పదము, ఒక గద్దింపుగా, వ్యంగ్యంగా కూడ వాడబడవచ్చును (22:12; 26:50), గనుక ఇచ్చటి విషయము ఇదై యుండును. ఈ పదమునకు *philos*, కును గల తేడాను గుర్తించవలెను, ఏలయనగా, ఒక పని చేయుటకు కూలి వానిగా పిలువబడినవాడు, సమానత్వ అవగాహన చొప్పున సాధారణంగా ఒక "స్నేహితుడు" అని పరిగణింపబడడు. పనిచేయు చోట్లలో ఉండు నైతిక విలువల ప్రకారము, బీదలు ఇంటి యజమానుడు చూపించినట్లుగా, ఎటువంటి దయాదాక్షిణ్యపూర్వక మేలులనైనను ఆశించరు. ఆ యజమానుడు వారికిచ్చిన దిన కూలిని బీదలు, అది అతని "అనుగ్రహము" అని ఎంచుదురు.[11]

**నేను నీకు అన్యాయము చేయలేదే; నీవు నా యొద్ద ఒక దేనారమునకు ఒడబడలేదా?** అని యజమానుడు చెప్పాడు. వారు మొదటి ఒడబడిన మొత్తము గూర్చి ఆయన వారికి గుర్తుచేసాడు. ఆయన వారిని వంచించలేదు, ఏలయనగా వారికియ్యబడు కూలీకి పనిచేయుటకు వారు ఒడబడ్డారు.

ఇంకా, **నీ సొమ్ము నీవు తీసికొని పొమ్ము** అని యజమానుడు చెప్పాడు. వీరి యెడల ఎటువంటి అన్యాయమైనను చూపబడలేదు గనుక, వారు తమకు రావలసిన కూలి తీసికొని దానితో సంతృప్తిపడవలెను. వారు ఆనాడు సంపాదించుకొనగలిగిన ఒక దేనారము వారి కుటుంబముల ఆ నాటి ఆహారమునకు సరిపడును.

అటుతరువాత ఆయన, **నీ కిచ్చినట్టే కడపట వచ్చిన వీరికిచ్చుటకును నాకిష్టమైనదని** చెప్పాడు. నిస్సందేహముగా ఆయన చివరిలో కూలీకి పిలిచినవారి యెడల కనికరముగలవాడయ్యాడు. యజమాని వీరికి ఒక గంటకు సరిపడు కూలి ఇచ్చినట్లయితే, అది వారు తమ కుటుంబములను ఆ నాడు పోషించుకొనుటకు చాలదు.

మొదట వచ్చినవారిని వారుండవలసిన మొదటి స్థానములోనే వారినుంచుచు, **నాకిష్టము వచ్చినట్లు నా సొంత సొమ్ముతో చేయుట న్యాయము కాదా?** అని ఆయన ఒక అలంకారయుక్తమైన ప్రశ్న వేసాడు. ఆయన దానితో తనకిష్టము వచ్చినట్టు చేయుటకు అది ఆయన సొంత సొమ్మైయుండినప్పుడు, ఆయన ఎందుకు పొరపాటు చేయుచున్నాడని నిందింపబడ్డాడు? నిశ్చయముగా, వారు తమ పనులను ఏ గంటకు మొదలుపెట్టారను విషయంతో నిమిత్తము లేకుండా, ఆయన వారికియ్యదలచిన తన కిష్టమైన మొత్తముతో తన పనివారి నష్టమును/లోటును పూరించుటకు ఆయనకు హక్కు ఉండినది.

**నేను మంచివాడనైనందున నీకు కడుపుమంటగా ఉన్నదా?** అంటూ యజమానుడు తన

ముగింపు మాటలు పలికాడు. కడుపు మంట అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*ponēros*) సర్వసాధారణంగా "చెడు" అని అనువదింపబడినది (చూడు KJV). ఏదిఏమైనా, "చెడిన కన్ను" కలిగియుండుట అనగా, "పిసినారియై" "పేరాసగలవాడై," లేక "అసూయపరుడై" యుండుట యని అర్థము (6:23పై గల వ్యాఖ్యానము చూడు). "ఉదారత" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*agathos*) సర్వసాధారణంగా "మంచి" అని అనువదింపబడినది (చూడు KJV). ఈ పదము క్రిందటి అధ్యాయంలో, "మంచివాడొక్కడే" అనగా దేవుడొక్కడే మంచివాడని యేసు పలికిన సందర్భములో అగుపించుచున్నది (19:17). మొదట పొద్దున్నే వచ్చిన పనివారు, వారి కంటె తక్కువ సమయము పనిచేసినవారి యెడల యజమానుని ద్వారా ప్రదర్శింపబడిన ఉదారత గూర్చి అసూయ పడుచుండుట సమస్యయై యుండినది, అసూయ, ఒక హేతువుపై ఆధారపడియున్నది; అది స్వార్థములో నుండి పుట్టును.

**వచనము 16. ఈ ప్రకారమే కడపటివారు మొదటివారు కడపటివారగుదురు** అని చెప్పుచు యేసు ఈ ఉపమానమును ముగించాడు. ఈ వాంగ్మూలము 19:30కి సమానంతరమైనదై యున్నది; ఈ పలుకులు ఉపమానమునకు ఊతనిచ్చు కొసపలకలుగా ప్రయోజనకరమైనవై యుంటున్నవి. ఈ వరుస క్రమము తిరగ రాయబడి, మొదటి పదబంధంలోని పదక్రమాన్ని రెండో పదబంధంలో తారుమారు చేయుచున్నది:

ఏ 1: "మొదటివారు అనేకులు కడపటివారగుదురు;
బి 1: "కడపటివారు మొదటివారగుదురు" (19:30).
బి 2: "ఈ ప్రకారమే కడపటివారు మొదటివారగుదురు,
ఏ 2: మొదటివారు కడపటివారగుదురు" (20:16).

ఈ ఉపమానము యొక్క అర్థము పేతురడిగిన ప్రశ్నకు సంబంధించినదై యున్నది (19:27). దేవుని రాజ్యములో సేవ చేయుటకు ప్రతిఫలముగా పొందుట గూర్చి వారు చింతించకూడదని యేసు పేతురుకును, అతనివంటి మనస్తత్వంగల ఇతరులకును తెలియజెప్పుచుండెను. దానికి మారుగా, తాను పొందినది ఏదైనను దానికి అతడు కృతజ్ఞుడై యుండవలెను. యేసు అనుచరులు దేవుని రాజ్యములోనికి వారికి తరువాత ప్రవేశించువారి గూర్చి అసంతృప్తిని కనుపర్చకూడదు, కానీ వారు ప్రవేశించగలిగినందుకు సంతోషించవలెను. ప్రతిఫలముల గూర్చిన విషయమును, ఆ బాధ్యత అప్పగింపబడినవానికే వదిలిపెట్టవలెను.[12] న్యాయాధిపతి, క్రీస్తే; విశ్వసనీయమైనవారికి ప్రతిఫలమిచ్చువాడును, అవిశ్వసనీయమైనవారికి శిక్షను ప్రధానం చేయువాడును ఆయనే. ఒకడు దేవుని రాజ్యములో ప్రవేశించినప్పుడు, వానికియ్యబడు ప్రతిఫలము వాడు చేసిన క్రియల కొరకు కాదు, కానీ అది వానికి కృపతో కూడిన ఒక వరముగా ఇవ్వబడును. దేవుని రాజ్యము "కృప గల ప్రదేశము." పౌరులందరును సమానస్థులుగా స్వీకరింపబడుదురు. ఏ ఒక్కరను ఇతరుల కంటె హెచ్చు స్థాయిలో ఉంచబడరు. రాజ్యములోని ప్రత్యేక ప్రతిఫలముల గూర్చి యేసు పరోక్షంగా ప్రస్తావించినప్పటికిని (5:19; 10:41, 42; 19:28), దేవుని రాజ్యము లోనికి ప్రవేశించుట మరియు పాలుపంచుకొనుటకు సంబంధించినంత వరకు, పౌరులందరును సమానులే.[13]

## అసన్నమగుచుండిన ఆయన మరణము గూర్చి యేసు చేసిన మూడవ ప్రకటన (20:17-19)

**[17]యేసు యెరూషలేమునకు వెళ్లనైయున్నప్పుడు ఆయన పండ్రెండుమంది శిష్యులను ఏకాంతముగా తీసికొనిపోయి, మార్గమందు వారితో ఇట్లనెను. –[18]ఇదిగో యెరూషలేమునకు వెళ్లుచున్నాము; అక్కడ మనుష్యకుమారుడు ప్రధానయాజకులకును శాస్త్రులకును అప్పగింపబడును; వారాయనకు మరణశిక్ష విధించి [19]ఆయనను అపహసించుటకును కొరడాలతో కొట్టుటకును సిలువవేయుటకును అన్యజనులకు ఆయనను అప్పగింతురు; మూడవ దినమున ఆయన మరల లేచును.**

వినయము మరియు ఘనత గూర్చిన ప్రధానాంశములు (20:16) యేసు జీవితంలో సోదాహరణంగా చిత్రీకరింపబడి యున్నవి. ద్వేషముతో కూడిన తన మరణములో ఆయన "కడపటివాడై" యుండును, అట్లయినను పునరుత్థానములో ఆయన "మొదటివాడై" (ప్రథమఫలమై) యుండును. ఆసన్నమగుచుండిన తన మరణము గూర్చి యేసు తన పన్నెండు మంది శిష్యులకు తెలియజెప్పుట ఇది మూడవసారి (16:21; 17:22, 23; 20:18, 19).[14] వారిని తన సిలువ మరణము నిమిత్తము సిద్ధపర్చుటకు, ఆ సమయంలో వారు బెదరిపోయి చెదరిపోకుండునట్లు, ఆయన దాని గూర్చిన ముందుసూచనలు వారికి పున:రుక్తము గావించాడు. అదేవిధముగా, పాఠక మహాశయులు తమ దృష్టిని యేసు యొక్క అంతిమ లక్ష్యముపైనే నిలిపియుంచునట్లు మత్తయి ఈ సంఘటలనన్నింటిని గ్రంథస్థంచేసాడు. దేవుని రాజ్యము నిమిత్తము శిష్యులు నిశ్చయముగా తమ వంతు త్యాగములు చేసారు (19:27-29), కానీ యేసు, ప్రాయశ్చిత్తాంతమైన తన మరణము ద్వారా అంతిమ బలియాగమును చేయునై యున్నాడు.

**వచనము 17. యేసు** మరియు ఆయనను వెంబడించుచుండినవారు అప్పటికి యింకా పెరియలోనే ఉండియుందురు (19:1), లేదా యెరికో పట్టణ దిశగా సాగుచుండిన వారి ప్రయాణంలో బహుశా వారు అదివరకే యొర్దాను నదిని దాటియుందురు (20:29). "యేసు వారికి ముందు నడుచుచుండెననియు," ఆయనను వెంబడించుచుండినవారు "విస్మయమొందిరి" మరియు "భయపడిరి" అనియు మార్కు 10:32 చెప్పుచున్నది. వారు **యెరూషలేమునకు వెళ్లవలసిన** సమయము సమీపించుచుండినది, గనుక ప్రభువు తన **పన్నెండు మంది శిష్యులను** ఏకాంతముగా తీసికొనివెళ్లి, పరిశుద్ధ పట్టణములో సంభవింపనై యుండిన విషయముల గూర్చి వారికి ఆదేశములిచ్చాడు.

**వచనములు 18, 19. ఇదిగో, మనము యెరూషలేమునకు వెళ్లుచున్నాము** అని దృఢసంకల్పముతో, యేసు చెప్పాడు. గలిలయ ప్రాంతమును విడిచిపెట్టక మునుపు, ప్రభువైన యేసు "యెరూషలేమునకు వెళ్లుటకు మనస్సును స్థిరపరచుకొనెను" (లూకా 9:51; NKJV); గనుక ఆ నాటి నుంచి ఆయన తన లక్ష్యమును సాధించకుండునట్లు అడ్డుపడుచుండిన దేనినైనను ఆయన అనుమతించలేదు.

యేసుక్రీస్తు శ్రమల గూర్చిన ఈ పూర్వసమాచారము, ఆయన యూదులు మరియు రోమనుల చేతుల్లో ఏ యే విషయాలను సహించనై మరియు భరించనై యుండెనో అని యేసు చెప్పిన విషయములకు సంబంధించినంత వరకు సువార్తలలో అత్యంత వివరములతో

కూడినదై యున్నది. యేసు తన కళ్లముందున్నట్లుగా ఎదురుచూచుచుండిన మరణమునకు సంబంధించిన సంఘటనలు అంతకంతకు ఎక్కువ ఆసన్నమగుచుండినవి. మొదటిగా, ఆయన **ప్రధాన యాజకులకును శాస్త్రులకును** అప్పగింపబడును. ఆయన గెత్సేమనె తోటలో ఉండినప్పుడు యూదా కాపలావారిని యేసు యొద్దకు నడిపించి, ఆయనను వారిని అప్పగించినప్పుడు ఇది నెరవేరినది (26:47). రెండవది, ప్రధానంగా ప్రధాన యాజకులు మరియు శాస్త్రులే సభ్యులై యుండి సన్హెడ్రిన్ మహా సభ యెదుటికి, ఆయన కొనిపోబడెను (26:57). ఆయనను **మరణమునకు అప్పగించుటకే** ఈ మహాసభ తీర్మానించింది (27:1), కానీ వారు అట్టి తీర్పును అమలు చేయుటకు వారికి అధికారము లేకుండెను (1:19; 10:18; 12:14పై గల వ్యాఖ్యానము చూడు). తత్ఫలితంగా, వారు యేసును అన్యజనులకు మరణము విధించుటకు అధికారముగల **అన్యజనులకు** యేసును అప్పగించిరి. "అన్యజనులు" అను మాట ప్రధానంగా ప్రాంతీయ పరిపాలకుడై యుండిన పిలాతును సూచించుచున్నది (27:2). వారు ఆయనను **అపహసించి కొరడా దెబ్బలు కొట్టునట్లు** పిలాతు యేసును తన సైనికులకు అప్పగించాడు (27:27–30; మార్కు 15:15). ఈ అవమానము మరియు బాధను సహించిన పిదప, వారు ఆయనను **సిలువవేయునట్లు** యేసును గొల్గొతా అను స్థలమునకు తీసికొనివెళ్లారు (27:31).

మత్తయి వ్రాసిన సువార్తలోని దీనికి ముందటి పూర్వసూచనలలో యేసు మరణించనై యుండిన తీరు నిర్దిష్టముగా పేర్కొనబడలేదు (16:21; 17:22, 23). ఇప్పటి వరకు, ఆయన సిలువవేయబడుట గూర్చిన అభిప్రాయము, ఆయనను వెంబడించగోరు శిష్యుడు తన సిలువనెత్తుకొని ఆయనను వెంబడింపవలసి యుండునను సందర్భములో సూచనప్రాయంగా మాత్రమే సూచింపబడినది (10:38; 16:24). ఏదిఏమైనా, యేసు సిలువవేయబడునను ఆలోచన ఇచ్చుట విదితము గావింపబడినది. ఆసక్తికరంగా, యేసు క్రీస్తు శ్రమల గూర్చిన ఏ ముందుసూచననైనను నివేదించుటకు "సిలువవేయుము" (*stauroō*) అను పదమును సమదృక్పథ సువార్తలలో మత్తయి సువార్తలో మాత్రమే వాడుచున్నది; మార్కు మరియు లూకా సువార్తీకులు దీనికి మారుగా "చంపుము" (*apokteinō*) అను పదమును ప్రయోగించుచున్నారు (మార్కు 10:34; లూకా 18:33).

ఒకరిని సిలువవేయుట యూదులు అవలంబించుచుండిన మరణ దండన విధానము కాదు. యూదులు రాళ్ల చేత కొట్టుట, కాల్చివేయుట, తలగొట్టుట లేక గొంతు నులిమి చంపుట మొదలగు విధానములను ఉపయోగించుచుండిరి.[15] అన్యజనులు ప్రముఖంగా రోమనులు ఈ కాలములో – పరదేశులను, బానిసలను, మరియు నిమ్న వర్గములకు చెందిన నెరస్థులను సిలువవేయు విధానమును ఉపయోగించారు.[16]

చివరగా, **మూడవ దినమున ఆయన మరల లేచును** అని యేసు వారికి ముందుగా సూచించాడు. ఆయన సిలువపై మరణించిన తరువాత, ఆయన యోసేపు అరిమతయి చేత తన సొంతం కోసం క్రొత్తగా తొలిపించుకొనిన సమాధిలో పాతిపెట్టబడ్డాడు (27:59, 60). మరణము ఆయనను బంధించి యుంచలేకపోయింది, గనుక ఆయన మూడవ దినమున వేకువనే లేచాడు (28:1, 7). మత్తయి సువార్తలో వ్రాయబడి యున్న మూడు ముందుసూచనలు కూడ యేసు పునరుత్థానము గూర్చిన విజయోత్సవ జయభేరితో ముగియుచున్నవి (16:21; 17:23; 20:19).

## దేవుని రాజ్యములోని గొప్పతనము (20:20–28)

**[20]అప్పుడు జెబెదయి కుమారుల తల్లి తన కుమారులతో ఆయనయొద్దకు వచ్చి నమస్కారముచేసి యొక మనవి చేయబోగా –[21]నీవేమి కోరుచున్నావని ఆయన అడిగెను. అందుకామె–నీ రాజ్యమందు ఈ నా యిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను ఒకడు నీ యెడమవైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను. [22]అందుకు యేసు– మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు; నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగ గలరా? అని అడుగగా వారు–త్రాగగలమనిరి. [23]ఆయన–మీరు నా గిన్నెలోనిది త్రాగుదురు గాని నా కుడివైపునను నా యెడమవైపునను కూర్చుండనిచ్చుట నా వశమునలేదు; నా తండ్రిచేత ఎవరికి సిద్ధపరచబడెనో వారికే అది దొరుకునని చెప్పెను. [24]తక్కిన పదిమంది శిష్యులు ఈ మాట విని ఆ యిద్దరు సహోదరుల మీద కోపపడిరి. [25]గనుక యేసు తనయొద్దకు వారిని పిలిచి–అన్య జనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురనియు, వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురనియు మీకు తెలియును. [26]మీలో ఆలాగుండకూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; [27]మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. [28]ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను.**

ఆయన సందేశమును అంగీకరించుటలో లేదా అర్థం చేసికొనుటలో శిష్యులు ప్రదర్శించిన వైఫల్యము, యేసు క్రీస్తు శ్రమల గూర్చిన ముందుసూచనల వెనువెంటనే కలదు. మొదటి ముందుసూచన తరువాత, పేతురు యేసును ప్రక్కకు తీసికొనివెళ్లి ఆయనను గద్దించాడు (16:22, 23). రెండవ ముందుసూచన చెప్పబడిన కొంతసేపటికి, రాజ్యములో ఎవడు గొప్పవాడను విషయము గూర్చి చర్చ మొదలయ్యింది (18:1–4). ఈ మూడవ సందర్భములో, రాజ్యములో అధికారి హోదాలు గల స్థానముల కొరకు ఒక మనవి చేయబడింది (20:20–28).

**వచనము 20. అప్పుడు జెబెదయి కుమారుల తల్లి** తన కుమారులతో ఆయన యొద్దకు వచ్చి నమస్కారము చేసి యొక **మనవి చేయబోయెను**. ఈ స్త్రీ **యేసును** వెంబడించుచుండిన వారితో పాటుగా, ఆయన సిలువవేయబడుట, పాతి పెట్టబడుట, మరియు ఖాళీ సమాధిని చూచిన వారిలో ఉన్న ఆమె పేరు సలోమే (27:56 మరియు మార్కు 15:40ను పోల్చిచూడు). ఆమె యేసు తల్లియైన మరియ సహోదరియై ఉండవచ్చును (27:56; మార్కు 15:40; యోహాను 19:25). ఇదే నిజమైనట్లయితే, ఆమె యేసునకు పిన్నమ్మ ఔతుంది, గనుక ఆమె కుమారులు యాకోబు మరియు యోహాను యేసునకు పిన్నమ్మ పినతండ్రికి కలిగిన సంతానమే అని అర్థమగును. వారి మధ్య ఇంతటి సమీప బంధుత్వమున్నందునుబట్టి, దీని ఆధారంగా ఆమె చేసిన మనవి సహేతుకమైనదే అని ఆమె అనుకొని యుండవచ్చును.[17] దీనికి అదనంగా, యాకోబు మరియు యోహాను యేసు ఏర్పర్చుకొనిన పన్నెండు మంది శిష్యులలో ఆయనకు అత్యంత సన్నిహితముగా నుండినవారై యుండిరి (17:1పై గల వ్యాఖ్యానము చూడు). వీరు, పేతురు మరియు అంద్రెయతో కూడ యేసు ఏర్పరచుకొనిన

తొలి శిష్యులై యుండిరి (4:18–22).

మార్కు సువార్త జెబెదయి భార్యను పేర్కొనుట లేదు; యాకోబు మరియు యోహాను వారి మనవితో యేసు యొద్దకు వచ్చారని మాత్రమే మామూలుగా చెప్పుచున్నది (మార్కు 10:35–37). మత్తయి సువార్తలో, ఈ ముగ్గురు యేసు యొద్దకు వచ్చారు, కానీ తల్లి మాత్రమే యేసును నోరు విప్పి మనవిచేసింది. కథ ముందుకు సాగుచుండగా, సలోమే చేసిన మనవి మరియు ఆమె కుమారుల ఆశ ఒకటే అయియుండినదని రుజువగుచున్నది (20:22, 24). యేసు రోజుల్లో, ఒక తల్లి తన కుమారుల పదోన్నతుల నిమిత్తము అధికారములో ఉన్న ఎవరినైనను నేరుగా సమీపించి మనవి చేయుట అసాధారణమైన అంశమేమీ కాదు. పాత నిబంధనలో, వృద్ధుడగుచుండిన రాజైన దావీదు ఆమె కుమారుడైన సొలొమోనునకు రాజుగా పట్టాభిషేకము చేయవలెనని బత్షెబ దావీదును మనవి చేసింది (1 రాజులు 1:15–21).[18]

**వచనము 21.** పేతురు అదివరకు అడిగిన ప్రశ్నకు సమాధానముగా, వారు "పన్నెండు సింహాసనముల మీద ఆసీనులై, ఇశ్రాయేలు పన్నెండు గోత్రములకు తీర్పు తీర్చుదురని" యేసు అపొస్తలులకు తెలియజెప్పాడు (19:28). తన **ఇద్దరు కుమారులు రాజ్యములో ప్రభువునకు కుడి వైపునను, ఎడమ వైపునను** కూర్చుండునట్లు అనుమతించవలెనని సలోమే యేసును మనవి చేయునట్లు ఈ వాగ్దానము ఆమెను ప్రోత్సాహించి యుండును. ఇవి అత్యున్నత గౌరముగల హోదాతో కూడిన స్థానములై యుండినవి–పరిపాలనాధికారములో ముఖ్య స్థానములు. కుడి వైపున నున్నది మొదటి స్థానము, ఎడమ వైపున నున్నది రెండవ స్థానము. రాజైన సౌలు భోజనపు బల్ల యొద్ద ఈ రెండు స్థానములు, కుడి వైపున అతని కుమారుడు యోనాతాను చేతను, ఎడమ వైపును అతని సేనాధిపతి అబ్నేరు చేతను హస్తగతం చేసికొనబడినవి జోసీఫస్ చెప్పాడు.[19]

యాకోబు, యోహాను మరియు వారి తల్లి సలోమే, రాజ్యము యొక్క అసలు స్వభావము గూర్చి సంపూర్తిగా అపార్థం చేసికొన్నారు. యేసు ఆరోహణమగునంత వరకు కూడ (అపొస్తలుల కార్యములు 1:6), ఇతర శిష్యులు దీని గూర్చిన తప్పుడభిప్రాయము కలిగియుండిరి. వారు కళ్లకు కనబడుచుండినది, ఇహలోక రాజ్యము కొరకు ఎదురు చూసారు; కానీ క్రీస్తు రాజ్యము "ఈ లోక సంబంధమైనది కాదు," అది అధ్యాత్మికమైనదై యుండెను (యోహాను 18:36).

**వచనము 22.** సలోమే చేసిన మనవికి **యేసు** ప్రత్యుత్తరమిచ్చినప్పుడు, ఆయన తన జవాబును సూటిగా సలోమేతో చెప్పలేదు. దానికి బదులుగా, ఆయన సూటిగా యాకోబు మరియు యోహానుతో మాటలాడాడు: **మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు. నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగగలరా?** అని వారినడిగాడు. ఆయన యెరూషలేములో సంభవింపనై యుండిన తన మరణమును సూచించుచుండెను. ప్రాచీన కాలములో, నేరస్థులు తరుచుగా ఒక గిన్నెడు విషము త్రాగునట్లు బలవంతము చేయబడుట ద్వారా వారి ప్రాణములు తీయబడినవి. ఉన్నతాధికారులు దొంగ చాటుగా హత్య చేయబడిరి లేదా ఇతర నేరస్థుల వలెనే వారు కూడ విషం త్రాగి ప్రాణాలు కోల్పోవుచుండిరి. "గిన్నె" శ్రమలు మరియు మరణమునకు ఒక చిహ్నామయ్యింది. యేసు ఈ చిహ్నామును ఇదే భావముతో పలుకుచుండెను.[20]

అటుతరువాతి కొన్ని గ్రీకు చేతిరాత ప్రతులు, “లేదా, నేను పొందుచున్న బాప్తిస్మము పొందుటయైనను మీ చేత అగునా?” అను మాటలు చేర్చినవి. స్పష్టముగా, ఈ మాటలను శాస్త్రులు మార్కు 10:38లో నుండి నకలు చేసారని తెలియుచున్నది.[21]

యేసు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చుచు ఇద్దరు సహోదరులు కూడ, **త్రాగగలమని** అన్నారు. వారి మాటలు క్రీస్తు యెడల వారు కలిగియున్న శ్రద్ధాభక్తులను మరియు ఆత్మవిశ్వాసమును సూచించుచున్నవి (చూడు 26:33, 35). ఏది ఏమైనా, వారు నిజముగా ఆయన మాటల అసలు అర్థమును గ్రహించలేదు.

**వచనము 23.** అప్పుడు యేసు వారు నిజముగానే ఆయన **త్రాగు గిన్నె** లోనిది త్రాగుదురు. కానీ దేవుని రాజ్యములోని ముఖ్య పదవులను **వారికిచ్చుట** ఆయన చేతిలో లేదని యాకోబు మరియు యోహానుతో చెప్పాడు. దాని గూర్చిన నిర్ణయము పరలోకమందున్న **తండ్రి** చేతనే తీసికొనబడును.

సమయము వచ్చినప్పుడు, ఈ అపొస్తలులు, యేసు ముందుగానే చెప్పినట్లు, శ్రమ యను గిన్నెలోనిది త్రాగారు. యేసు క్రీస్తునందలి విశ్వాసమునుబట్టి మొట్టమొదట హతసాక్షియైనవాడు యాకోబే (అపొస్తలుల కార్యములు 12:1, 2). యోహాను సహజ మరణం నొందాడని విశ్వసింపబడుచున్నప్పటికిని, తన జీవిత కాలములో బహు శ్రమల ననుభవించాడు. సంఘము వ్యవస్థాపింపబడుచుండిన తొలి రోజుల్లో, ఆయన చెరను అనుభవించాడు, కొరడా దెబ్బలు సహించాడు (అపొస్తలుల కార్యములు 4:3; 5:17, 18, 40). మొదటి శతాబ్దము ముగింపులో, ఆయన పత్మసు ద్వీపమునకు దేశబహిష్కరణ గావింపబడ్డాడు. రోమా ప్రభుత్వ ఖైదీలు మరియు అభిప్రాయభేదముల మూలమున అసంతృప్తిచెందుచుండినవారు తరుచుగా గ్రీకు మరియు టర్కీ దేశములకు మధ్య నుండిన మధ్యధరా సముద్రములో ఉండిన ఇటువంటి చిన్న చిన్న ద్వీపములకు దేశబహిష్కరణ గావింపబడుచుండిరి.[22] ఆయన పత్మసు ద్వీపములో నున్న కాలములో, యోహాను దేవుని ప్రత్యక్షత పొందాడు (ప్రకటన 1:9). సాంప్రదాయము ప్రకారంగా, చక్రవర్తియైన డొమీషియన్ మరణము వరకు కూడ యోహాను అచ్చటనే కాలము గడిపాడు, ఆ తరువాత ఆయన ప్రధాన భూభాగమునకు తిరిగి వచ్చి, తన శేష జీవితమును ఎఫెస్సు పట్టణంలో గడిపాడు.[23]

**వచనము 24**. తన కుమారులు, యాకోబు మరియు యోహాను పక్షంగా వారి తల్లియైన సలోమే యేసు యొద్ద చేసిన మనవిని మిగిలిన **పది** మంది శిష్యులు విన్నప్పుడు, **ఆ యిద్దరు సహోదరుల మీద కోపపడిరి.** భావోద్రేకపూరితమైన ఈ ప్రతిస్పందన నీతియుక్తమైన కోపము కాదు; అది వారి స్వార్థాపేక్షతోను అనిష్టముతోను కూడినదై యుండెను. ఇదే మనవి వారు సలోమే కంటె ముందుగానే యేసు యొద్ద చేయునందుకు బహుశా వారు కోపము తెచ్చుకొని యుందురు. వారు కైసరుదైన ఫిలిప్పు పట్టణము నుండి కపెర్నహోమునకు వచ్చుచుండగా, పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడై యుండునో యని వారు గట్టిగానే చర్చించారు (18:1); కానీ వారు చర్చించుచుండిన విషయమేమై యున్నదో ఆయనకు చెప్పుమని యేసు వారినడిగినప్పుడు, వారు బహుగా తత్తరపడిపోయినందున యేసుకు ఏమని సమాధానం చెప్పాలో వారికి తోయలేదు (మార్కు 9:33, 34). చివరి రాత్రి భోజన సమయంలో సహితము, వారు ఇదే విషయాన్ని వారిలో ఎవడు “గొప్పవాడు” అంటూ ఇంకా

తమలో తాము చర్చించుకొనుచుండిరి (లూకా 22:24). తమలో తాము వాదోపవాదములు చేసుకొనుచుండిన ఇతదంతము, ఆచరణాత్మక సమాధానముగా ఆయన వారి పాదములు కడుగుటకు కారణమయ్యింది (యోహాను 13:1-20)

**వచనము 25.** అపొస్తలుల ఆగ్రహమునకు ప్రతిస్పందనగా, **యేసు** కలుగజేసుకొన్నాడు, అందరి మధ్య సమాధానమును నెలకొల్పుచుండిన మధ్యవర్తిగా ప్రవర్తించాడు. మరొక పర్యాయము, ఆయన ఒక వ్యతిరేకార్థక ఉదాహరణముగా **అన్యజనులను** తీసుకొన్నాడు (చూడు 5:47; 6:7; 32; 18:17). ఆయన రాజ్యము అన్యజనుల రాజ్యముల వంటిదై యుండదని ఆయన తన అపొస్తలులకు తెలియజెప్పాడు. వారి **అధికారులు** మరియు వారిలోని **గొప్పవారు** – చక్రవర్తులు, రాజులు, ప్రాంతీయాధికారులు, మరియు ఇతర సాధికార అధికారులతో సహా – ఇహలోక పౌరులపై వారి పెత్తనము చెలాయించుచుందురనునది తెలిసిన విషయమే. యేసు రాజ్యము అలాంటిదై యుండదు.

అన్యజనులలో పరిపాలనా అధికారులందరును ఇతరులను అణగద్రొక్కుచుండినవారు కారు. వాస్తవమునకు, ఆ యా దేశములలో చెదరిపోయిన యూదులు వారి యెడల మర్యాదపూర్వకంగా ప్రవర్తించినవారిని ఎంతో గౌరవించుచుండిరి.[24] ఏది ఏమైనా, పాలస్తీనా దేశవాసులై యుండిన యూదులు, తరుచుగా పెత్తనం చెలాయించుచుండినవారి సొంత ప్రయోజనాల కొరకైన దోపిడీలకు గురియగుచుండిరి. యేసు ప్రయోగించుచుండిన పదజాలము, పరిమితులు మీరిన పన్నులు విధింపబడుట, పరిమితము చేయబడిన స్వాతంత్ర్యము, మరియు నియంత్రుత్వ సైనిక స్థావరములనుబట్టి రోమా ప్రభుత్వమువారు ఇశ్రాయేలు దేశమును ఆక్రమించుకొన్నారను విషయాన్ని అపొస్తలుల మనస్సులకు గుర్తుచేసి యుండును.[25] అమర్యాదగా వ్యవహరింపబడుచు అణగద్రొక్కబడుచుండిన ప్రజల మనస్సుల్లో, వారి ఆత్మాభిమానమును మరియు వారి దేశములో వారికి ఉండవలసిన న్యాయమైన హక్కుగల స్థానమును వారు తిరిగి సంపాదించుకొనుటకు సైనిక అధికారము స్థాపించుట మాత్రమే వారికి మిగిలి యుండిన ఒకే ఒక మార్గమై యుండినది.[26] ఇది మితిమీరిన సాధరణీకరణమై యుండవచ్చును, కానీ అధికార పదవుల గూర్చి శిష్యులకుండిన ఆశలను అది సహేతుకంగా వివరించుచున్నది.

**వచనములు 26, 27.** వ్యతిరేకార్థమైన అన్యజనులైన అధికారుల గూర్చి ఉదహరించి చెప్పిన తరువాత, దేవుని రాజ్యములో ఒకనికుండు గొప్పతనమునకు సంబంధించిన సత్యమును యేసు వారికి సవివరంగా తెలియజెప్పాడు. ఆయన తన ఉపదేశమును సమానార్థపదములతో కూడిన సమనాంతర రూపములో నివేదించాడు. మొదటి వరుసలోని ఆలోచన అదే విధమైన మాటలతో రెండవ వరుసలో పునరుక్తము గావింపబడినట్లు మనము చూడగలము:

**... మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను.**

మొదటి వరుసలోని "గొప్పవాడు" రెండవ వరుసలోని "ముఖ్యుడు" అను మాటకు సమానాంతరమైనదై యున్నది. అదే విధముగా, "పరిచారకుడు" అను పదము "దాసుడు" అను పదముతో సంబంధము గలదై యున్నది. ఈ వచనములో అవి పర్యాయ పదములుగా

ప్రయోగింపబడినప్పటికిని, పరిచారము లేక పరిచారకుడు అను భావముగల గ్రీకు మాటలు వెవ్వేరు అర్థములు కలిగియున్నవి. "పరిచారకుడు" (*diakonos*) ఒక యజమాని ఇంటిలో కూలి పనికి పిలిపించుకొనబడినవాడై యుండగా, "దాసుడు" (*doulos*) శ్రమించి పనులు చేయునట్లు బలవంతము చేయబడుచుండెను.[27]

ఏదో ఒక అధికార పదవిలో ఉన్నంత మాత్రాన క్రీస్తు రాజ్యములో గొప్పతనము రాదు; ఒకడు ఇతరులకు పరిచారము చేయవలెనను తాత్పర్యముతో తనను తాను తగ్గించుకొనుట ద్వారానే అది వచ్చును (చూడు 10:39; 16:24, 25). యేసు అనుచరులు ఈ సూత్రమును అర్థంచేసికొనుటకును ఆచరణలో పెట్టుటకును కష్టపడుచుండిరి–ఈ పరిస్థితి మానవ స్వభావమునకు వ్యతిరేకముగా ఉన్నట్లు అగుపించుచున్నది. ఏది ఏమైనా, కాలక్రమేపి, వారు పరిచారము చేయుటయే ఉత్తమమును అభిప్రాయమును అర్థంచేసికొని దానిని ఆలింగనము చేసికొన్నారు. గ్రంథకర్తలు తమ్మును తాము క్రీస్తు దాసులుగా గుర్తించుకొనుటతో క్రొత్త నిబంధనలోని అనేక పుస్తకములు మొదలుపెట్టబడి యున్నవి (రోమీయులకు 1:1; ఫిలిప్పీయులకు 1:1; యాకోబు 1:1, 2; 2 పేతురు 1:1; యూదా 1; ప్రకటన 1:1).

**వచనము 28.** వారు అనుకరింపదగిన నమూనాకు మాదిరిగా యేసు తన సొంత జీవితమునే వారి యెదుట ప్రదర్శించుచుండెను: "అలాగే, మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు, గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను." ఆయన ఇచ్చుటకే ఈ లోకమునకు వచ్చాడు, కానీ తీసికొనుటకు రాలేదు. విద్యలేని పామరులుకు ఉపదేశించుట, ఆకలిగొన్నవారికి ఆహారము పెట్టుట, రోగులను స్వస్థపర్చుట, దయ్యములచేత పట్టి పీడింపబడుచుండిన వారికి విడుదల కలుగజేయుట, మరియు మృతులను మరలా సజీవులనుగా చేయుట ద్వారా ఆయన దాసత్వమునకు అత్యంత గొప్పదైన మాదిరి అయ్యాడు. చిట్టచివరకు, పాపిష్టియైన మానవాళిని దేవునితో సమాధానపర్చునట్లు ఆయన సిలువ మీద తన సొంత ప్రాణమునే అర్పించాడు. యేసు, ప్రభువై యున్నప్పటికిని, ఆయన పరిపాలనా విధానము సరిగ్గా వర్ణింపబడిన అన్యజనుల నాయకత్వ శైలికి వ్యతిరేకమైనదై యున్నది (20:25; లూకా 22:24–27).

"అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకు" అను పదజాలము ప్రవక్తయైన యెషయా శ్రమ నొందు సేవకుని గూర్చి పలికిన ప్రవచనముపై ఆధారపడినదై యున్నట్లు అగుపించుచున్నది: "ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును [*psuchē*] ధారపోసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును [*pollōn*] భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" (యెషయా 53:12; LXX). మత్తయి సువార్తలో నున్న పదజాలము "అనేకులకు ప్రతిగా [*anti*] విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకును" అని అనువదింపబడవచ్చును. ఈ భాష ప్రభువైన యేసు క్రీస్తు యొక్క ప్రత్యామ్నాయ స్వభావముగల బలియాగము గూర్చిన క్రొత్త నిబంధన బోధకు చేయూత నిచ్చుచున్నది (యోహాను 10:11; రోమీయులకు 4:25; 5:6–11; 2 కొరింథీయులకు 5:21; గలతీయులకు 3:13, 14; తీతుకు 2:14; 1 పేతురు 1:18, 19; 2:24; 3:18 చూడు).

"క్రయధనము" అని అనువదింపబడిని పదము, (*lutron*) క్రొత్త నిబంధనలో

ఇచ్చట మరియు మార్కు 10:45లోని దీని సమానంతరమైన వాక్యభాగములో మాత్రమే అగుపించును. బానిసలను స్వతంత్రులనుగా చేయుటకు లేదా యుద్ధ ఖైదీలు తిరిగి స్వదేశమునకు తేబడునట్లు చెల్లింపవలసి యుండిన వెలను సూచించుటకు ఈ పదము గ్రీకు సాహిత్యములో ప్రయోగింపబడినది. అదే విధముగా, మానవులను పాపము యొక్క బానిసత్వము నుండి స్వతంత్రులను గావించుటకు యేసు తన ప్రాణము నర్పించాడు (రోమీయులతకు 6:15–23). సంబంధిత క్రియా పదము, *lutroō*, 1 పేతురు 1:18–19లో అగుపించుచున్నది, యేసు క్రీస్తు యొక్క అమూల్యమైన రక్తము విమోచన వెలయై యుండినదని అది ఘోషించుచున్నది. ఇదే క్రియా పదము తీతుకు 2:14లో కూడ అగుపించును, మనలను పాపము నుండి విమోచించునట్లు క్రీస్తు తనను తాను అర్పించుకొనెనని అది చెప్పుచున్నది. (సంబంధిత ఇతర పదముల కొరకు, చూడు రోమీయులకు 3:24; ఎఫెసీయులకు 1:7; 1 తిమోతి 2:6; హెబ్రీయులకు 9:12).

"క్రయధనము" గూర్చిన ఆలోచన ఒక ప్రశ్నను లేవదీయుచున్నది: "ఈ క్రయధనము ఎవరికి చెల్లింపబడినది?" సాతానుకా? దేవునికా? సరైన సమాధానము, 'దేవునికి' అయియుండవలెను. ఎఫ్. బుచ్‌సెల్ ఈ దృక్పథము గూర్చి బహు బలముగా వాదించుచున్నాడు:

> … క్రయధనమును స్వీకరించుచున్నవాడు, దేవుడు. యేసు మరణించినప్పుడు ఆయన దేవుని సేవించును, మరియు దేవుడు నిర్దయుడై తన కుమారుడు శ్రమనొందవలెనని కోరుచున్నాడు. దేవుడు ఆయనను మొత్తుచున్నాడు. ఈ విధంగా క్రయధనమును సాతాను పొందునేమో యను సాధ్యతను కొట్టివేయుచున్నది. మార్కు మరియు మత్తయి సువార్తలలో వ్రాయబడిన క్రీస్తు శ్రమల కథలో సాతాను ఎచ్చోటయైనను అసలే కనిపించడు. యేసు మరణించవలెనని సాతాను ఏమంత ఎక్కువగా ఆశించుట లేదు గనుక ఆయన ఈ మరణ పథములో పయనించకుండునట్లు తన దిశను మార్చుటకు వాడు ప్రయత్నించుచున్నాడు, మార్కు 8:33; మత్తయి 16:23. అది సాతాను బంధకముల నుండి అనేకులు విడిపింపబడవలెననెడి దేవుని సంకల్పమై యున్నదనుట గూర్చి యేసు కలిగియున్న శక్తివంతమైన భావనతో ఎవ్విధంగాను అనుగుణ్యముగా లేదు. వారు దేవునికి ఋణగ్రస్తమైయున్న స్థితిలో నుండి విడిపింపబడవలెనని ఈ భావన సాధికారపూర్వకంగా కోరుచున్నది.[28]

"అనేకులకు" అని యేసు ప్రయోగించిన పదమునుబట్టి యేసు కొంత మంది కొరకే, పరిమితమైన సంఖ్యలో చెప్పుకొనదగినంత మంది కొరకే మరణించాడని మనము అనుకొనవలసిన అవసరం లేదు ("పరిమితమైన ప్రాయశ్చిత్తము"). ఆ మాటకు "అందరు"అను అర్థముతో అదొక హెబ్రీ అభివ్యక్తముగా ఇచ్చట ప్రయోగింపబడినది (చూడు 26:28; హెబ్రీయులకు 9:28).[29] యేసు క్రీస్తు చేసిన బలియాగమునకు గల సార్వత్రిక అన్వయము గూర్చి క్రొత్త నిబంధనలోని ఇతర వాక్యభాగములు ఎటువంటి సంకోచమైనను లేకుండా స్పష్టముగా బోధించుచున్నవి (యోహాను 1:29; 3:16; 2 కొరింథీయులకు 5:14, 15; 1 తిమోతి 2:3–6; తీతుకు 2:11; 1 యోహాను 2:1, 2). ప్రత్యేకంగా, యేసు "అందరి కొరకు విమోచన క్రయధనముగా [*antilutron*] తన్నుతానే సమర్పించుకొనెనని" 1 తిమోతి 2:6 ధ్రువపర్చుచున్నది. యేసు క్రీస్తు యొక్క బలియాగము వలని ప్రయోజనములను ప్రతి ఒక్కడు అంగీకరింపకపోయినప్పటికిని, ఆయన సమస్త మానవాళి కొరకు మరణించాడు.

సారాంశముగా చెప్పుకొనట్లయితే, 28వ వచనము మనకు యేసు మరణము గూర్చి మూడు ముఖ్య సత్యములను బోధించుచున్నది. (1) అదొక స్వచ్ఛంద చర్యయై యుండినది, ఈ చర్యలో యేసు క్రీస్తు తనను తానే స్వేచ్ఛగా సమర్పించుకొన్నాడు. (2) అదొక ప్రత్యామ్నాయ చర్యయై యుండినది, దేవునికి వినయవిధేయతలతో లోబడవలసినవారై యుండియు, లోబడినవారి పక్షముగా చేయబడినది. (3) అదొక సార్వత్రిక చర్యయై యుండినది, ఈ విశాల విశ్వములోని సమస్త మానవాళి చేపట్టబడినది.[30]

### ఇరువురు గ్రుడ్డివారి కనుచూపును పున:కలుగజేయుట (20:29-34)

**29వారు యెరికోనుండి వెళ్లుచుండగా బహు జనసమూహము ఆయనవెంట వెళ్లెను.**
**30ఇదిగో త్రోవప్రక్కను కూర్చున్న యిద్దరు గ్రుడ్డివారు యేసు ఆ మార్గమున వెళ్లుచున్నాడని**
**విని–ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని కేకలు వేసిరి. 31ఊరకుండుడని**
**జనులు వారిని గద్దించిరి గాని వారు – ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని**
**మరి బిగ్గరగా కేకవేసిరి. 32యేసు నిలిచి వారిని పిలిచి–నేను మీకేమి చేయగోరుచున్నారని**
**అడుగగా 33వారు–ప్రభువా, మా కన్నులు తెరవవలెననిరి. 34కాబట్టి యేసు కనికరపడి వారి**
**కన్నులు ముట్టెను; వెంటనే వారు దృష్టిపొంది ఆయన వెంట వెళ్లిరి.**

పరిచారము గూర్చి బోధించిన పిదప (20:25-28), ఇరువురు గ్రుడ్డివారిని స్వస్థపర్చుట ద్వారా యేసు ఈ సూత్రమును ప్రదర్శించాడు. వాస్తవమునకు ఆయన ధ్యాస అంతా మున్ముందు యెరూషలేములో నెరవేర్చబడవలసి యుండిన రాయబార కార్యమంతటిపైనే కేంద్రీకరింపబడి యుండినప్పటికిని ఆయన కొంచెమాగి, అవసరములో నుండిన వారి యెడల తన కనికరమును ప్రదర్శించుటకు ప్రభువైన యేసు క్రీస్తు సమయము తీసికొన్నాడు.

**వచనము 29.** ఇద్దరు గ్రుడ్డివారికి యేసు వారి కనుచూపును మరలా కలుగజేసిన సంఘటన, యేసు తన శిష్యులతో కూడ యెరికో పట్టణమును విడిచివెళ్లుచుండిన సమయంలో జరిగినది. యేసు "యోర్దాను అద్దరి నున్న" యూదయ ప్రాంతములో ఉండెననియు (19:1), ఆ తరువాత ఆయన యెరూషలేమునకు పయనమై వెళ్లుచుండెననియు (20:17) అంతకు మునుపటి రిఫరెన్స్‌లు చెప్పుచున్నవి. ఈపాటికి, ఆయన పెరియ ప్రాంతమును విడిచి పెట్టి యొర్దాను నదిని దాటి యూదయ ప్రాంతమునకు వెళ్లియుండును. ఆయన యెరికో పట్టణమునకు వచ్చాడు, ఈ పట్టణము యొర్దానుకు పడమర దిశలో సుమారు ఐదు మైళ్ల దూరములో ఉండినది. యేసు యెరూషలేమునకు వెళ్లాలి, ఆ మార్గము ఏటవాలుగా ఎక్కడానికి ఎక్కువ కష్టముగా నుండి మెలికలు తిరిగినదై యుండెను. ఆ మార్గములో పయనించుటకు ప్రభువు సిద్ధపడుచుండెను; నిట్టనిలువుగా నుండిన వంపు సుమారు 2,600 అడుగుల ఎత్తులో ఉన్న ఒక శిఖరమునకు దారి తీసింది. యెరూషలేము, యెరికో పట్టణమునకు నైరుతి దిశలో సుమారు పదిహేను మైళ్ల దూరములో ఉండింది. ఇంత దూరము కాలినడకన వెళ్లుటకు సుమారు ఆరు నుండి ఎనిమిది గంటల సమయం పట్టుననియు, గనుకనే యేసు తన శిష్యులతో కూడ చేరాల్సిన స్థలానికి చీకటి కమ్ముకొనక మునుపే చేరుకొనుటకు ఆతరుపడుచుండెననియు మిఖాయేల్ జే. విల్కన్స్

అంచనావేసాడు.[31]

యెరికో నుండి యెరూషలేమునకు ఒంటరిగా పయనించుచున్నావంటే, అపాయమును కొనితెచ్చుకొనుచున్నావన్నట్లే ఏలయనగా ఆ దారి పొడుగున దొంగతనములు, దొపిడీలు తరుచుగా చోటుచేసికొనుచుండినవి (చూడు లూకా 10:30). బందిపోటు దొంగలు అకస్మాత్తుగా నిరాయుధలైన ప్రయాణీకులపైబడి వారిని దోచుకొనగలుగునట్లు వారు కొండ సందులలో లేదా బండల వెనుక దాగుకొనుచుండిరి. అందుచేతనే పెద్ద పెద్ద గుంపులుగా పయనించుచుండినవారు అంత ఎక్కువగా భయపడవలసిన అవసరము లేకుండింది.

ఈ సంఘటన విషయంలో సమదృక్పథ సువార్తలను సంప్రదించునప్పుడు, యేసు ఈ ఇద్దరు గ్రుడ్డివారిని స్వస్థపరచిన సమయంలో ఆయన తన శిష్యులతో కూడ ఉండిన స్థలమునకు సంబంధించి సంశయాత్మకమైన ఒక ప్రశ్న తలెత్తుచున్నది. యేసు మరియు తన శిష్యులు ఆ ఇద్దరు గ్రుడ్డివారిని కలిసికొనుట తటస్థించినప్పటికి "వారు యెరికో నుండి వెళ్లుచుండిరి" అని మత్తయి చెప్పుచుండగా, "యేసు యెరికో పట్టణమునకు సమీపించాదని" లూకా చెప్పుచున్నాడు (లూకా 18:35). యెరికో పట్టణములు రెండు ఉండినవని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు, పొంతన లేనట్లు అగుపించుచున్న ఈ తేడాను పరిష్కారముగా తెలిసికొనవచ్చును.

పాత నిబంధనలో పేర్కొనబడిన యెరికో పట్టణము యెహోషువ కాలములో నాశనము చేయబడినది (యెహోషువ 6) కానీ అటుతరువాత అది పునర్నిర్మాణం చేయబడినది (1 రాజులు 16:34). కాబట్టి క్రీస్తు కాలములో అచ్చట ప్రజలు నివసించుచుండిరి.

రెండవ (పాత మరియు క్రొత్త) నిబంధనల మధ్యకాలములో హాస్మోనియనుల చేత నిర్మించబడిన ఒక రాజభవనము చుట్టూర ఒక నూతన పట్టణము నిర్మింపబడినది. ఈ క్రొత్త పట్టణము అంతకు మునుపటి పట్టణమునకు సుమారు ఒక మైలు దూరములో ఉండినది. అటుతరువాత, హేరోదు మహా రాజు హాస్మోనియనుల చేత నిర్మింపబడిన రాజభవనమును విస్తరింపజేసుకొని, దానికి సమీపములోనే ఉండిన యింకా మూడు రాజభవనములను సహితము తన భూభాగములోనికి కలుపుకొన్నాడు. ఆయన చలికాలమును ఇచ్చట గడుపుటకు ఇష్టపడుచుండెను ఏలయనగా అది సముద్ర మట్టమునకు తక్కువ ఎత్తులో ఉండుట మూలమున అచ్చటి వాతావరణము వెచ్చగా ఉండినది.[32] ఈ రాజభవనములలో ఒక అతిథుల ఆహ్వాన గది, రోమా దేశ సంస్కృతి ప్రకారముగా నిర్మింపబడిన ఒక స్నానపు గది, తోట్లలో నాటబడిన పూల మొక్కల తోటలు ఈత కొలను, మరియు సువిశాలమైన ముందరి ప్రాంగణములుండినవి. హేరోదు ఒక నృత్యమందిరమును, గుఱ్ఱములతోను రథములతోను పందేలు నిర్వహించుటకు అనువైన ప్రదేశమును, మరియు ఒక వ్యాయామశాలను కూడ నిర్మించాడు. ఈతచెట్లు, తాటిచెట్లు మరియు రోజా పుష్పములు మొక్కలతో నిండియుండిన ఈ క్రొత్త పట్టణము, ఎంతో ఆహ్లాదకరమైన స్థలముగా తయారయ్యింది. మార్క్ అంతోని ఐగుప్తు దేశ రాణి క్లెయొపాత్ర పట్ల కలిగియుండిన ప్రేమకు చిహ్నముగా దీనిని ఆమెకు బహూకరించాడు.[33]

స్పష్టముగా, యేసు ఈ ఇద్దరు గ్రుడ్డివారిని కలిసికొనిన సమయంలో ఆయన పాత యెరికో పట్టణమును విడచి క్రొత్త యెరికో పట్టణములో ప్రవేశించుచుండెను. ప్రభువు ఆ మార్గమున నడిచి వెళ్లుచుండగా, బహు జనసమూహములు ఆయన వెంట వెళ్లుచుండిరి. పస్కా

పండుగ సమయము ఆసన్నమయ్యింది గనుక, అనేక మంది యాత్రికులు యెరూషలేమునకు చేరుకొనుచుండిరి. నూతన యెరికో పట్టణము లోనికి ప్రవేశమొసగుచుండిన ప్రధాన బాటలోని ఏదైన ఒక నిర్దిష్టమైన చోటు వారు బిచ్చమెత్తుకొనుటకు అనువైనదై యుండును (చూడు లూకా 18:35). పస్కా పండుగ నిమిత్తము ఎంతో సంతోషముతో యెరూషలేమునకు వెళ్లుచుండిన అధిక శాతం యాత్రికులు వారి ప్రయాణ ఖర్చులకు, భోజన ఖర్చులకు అవసరమై యుండు డబ్బును ఎక్కువ మొత్తములో వారితో కూడ తెచ్చుకొనియుందురు.

**వచనము 30.** ఇద్దరు గ్రుడ్డివారు త్రోవప్రక్కను కూర్చుండి యుండిరని మత్తయి వ్రాసిన సువార్త చెప్పుచున్నది. లూకా 18:35లో ఒక్క గ్రుడ్డివాని గూర్చి పేర్కొనబడి యుండగా, ఆ గ్రుడ్డివాడు "తీమయి కుమారుడగు బర్తిమయి" అని మార్కు 10:46 వాని పేరు చెప్పుచున్నది. ఈ తేడా లేఖనములలో ఒక వైరుధ్యముగా నున్నదని కొందరు దృష్టించుదురు. ఏది ఏమైనా, ఇక్కడ వాస్తవ వైరుధ్యమేదియు లేదు, ఏలయనగా యేసు ఒక గ్రుడ్డివానిని మాత్రమే స్వస్థపర్చాడని మార్కుగాని లూకా గాని చెప్పుట లేదు. ఒకనిపై దృష్టి కేంద్రీకరింపబడుచుండగా రెండవవాడు వానికి తోడుగా ఉండెనని భావించుటకు ఆస్కారమిచ్చుచు, ఈ నివేదికలు సామాన్యముగా ఒక గ్రుడ్డివాని గూర్చి నొక్కివక్కాణించుచున్నవి. ఒక్క బర్తిమయిని పేర్కొనుట కూడ ఒక సమస్య కాదు. ఈ సంఘటనలోని ఇద్దరు గ్రుడ్డివారిలో బహుశా అతడే ఎక్కువ నిష్కపటియైనవాడై యుండును.[34] వివరములన్నీ మనకు అందుబాటులో ఉండినట్లయితే, సమదృక్పథ సువార్తల మధ్య గల ప్రస్ఫుటమైన సామరస్యమును మనము స్పష్టముగా చూడగలము.

ఇటువంటి సందర్భములలో, మత్తయి దీని గూర్చిన ఎక్కువ సంపూర్తియైన వివరములనిచ్చాడని మనము గమనించాల్సి వుంటుంది. మత్తయి, దయ్యము పట్టి పీడింపబడుచుండినవారు (ఒక్కడు అని చెప్పబడిన దానికి భిన్నముగా) ఇద్దరు అనియు, (గాడిద పిల్ల అని మాత్రమే పేర్కొనబడిన దానికి భిన్నముగా) గాడిద మరియు గాడిద పిల్ల అనియు పేర్కొన్నాడు (8:28; 21:2పై గల వ్యాఖ్యానములు చూడు). ఇద్దరు గ్రుడ్డివారు స్వస్థపరచబడ్డారని మత్తయి నివేదించుట ఇది రెండవసారి (9:27–31).

ఈ ఇద్దరు గ్రుడ్డివారు యేసు ఆ మార్గములో వెళ్లుచుండినాడని వినిన తరువాత, "ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుము!" అని కేకలు వేసారు. "దావీదు కుమారుడు" అను మాటలు మెస్సీయాకు సంబంధించిన బిరుదై యున్నది (1:1; 9:27; 15:22పై గల వ్యాఖ్యానములు చూడు). గ్రుడ్డివారు చూపుపొందుట మెస్సీయా రాకడ సమయంలో సంభవించనై యుండిన ఒక దృగ్గోచర దృశ్యమై యుండినది (యెషయా 29:18; 35:5; 42:6–7; 11:5పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 31.** ఈ ఇద్దరు గ్రుడ్డివారు బిగ్గరగా కేకలు వేయుచు మొరపెట్టుచుండిన దానికి ప్రతిస్పందనగా, వారు నోరు మూసుకొని ఊరకుండవలెనని అచ్చటి జనసమూహము వారిని గట్టిగా హెచ్చరించారు. ఇంతకు మునుపు యేసు తమ చిన్న పిల్లలను ఆశీర్వధించవలెనని ఆయన యొద్దకు వారిని తీసికొని వచ్చిన తల్లిదండ్రులను శిష్యులు గద్దించినట్లుగానే (19:13), ఇప్పుడు ఈ జనసమూహము ఈ గ్రుడ్డివారి యెడల వ్యవహరించుచుండెను. సమాజము అంతగా పట్టించుకొనని వారి గూర్చి యేసు ఎక్కువగా పట్టించుకొనుచుండెనని ఆ ప్రజలు కొంచెమైనా ఆలోచించలేదు. ప్రజల ప్రతిస్పందన

ఈ గ్రుడ్డివారిలోని పట్టుదలను పెంచింది, గనుక వారు యింకా ఎక్కువ బిగ్గరగా కేకలు వేయుచు ప్రభువును పిలుచుచుండిరి.

**వచనము 32.** సహాయము అత్యావశ్యకమై యుండిన ఈ గ్రుడ్డివారికి యేసు సహాయము చేయకుండునట్లు ఆయనను ఆటంకపరచుటకు జనసమూహములు చేసిన ప్రయత్నమును యేసు విఫలము చేసాడు. జరుగుచుండినదేమిటో యేసు కళ్లారా చూసాడు మరియు చెవులారా విన్నాడు, గనుక ఆయన తానున్న చోటనే ఆగిపోయి, ఆ గ్రుడ్డివారిని ఆయన యొద్దకు తీసికొని రావలెనని ఆజ్ఞాపించాడు. కాబట్టి ఇంతవరకు వారిని అగౌరవపర్చుచు ఆటంకపర్చినవారు ఇప్పుడు వారిని ప్రోత్సాహించువారయ్యారు గనుక వారు, "ధైర్యము తెచ్చుకొనుము, ఆయన నిన్ను పిలుచుచున్నాడు; లెమ్ము!" అని పలికారు (మార్కు 10:49). అప్పుడు యేసు, "నేను మీకేమి చేయగోరుచున్నారు?" అని ఆ ఇద్దరు గ్రుడ్డివారినడిగాడు. యేసు అలా అడిగింది వారి అవసరత ఏమిటో ఆయనకు తెలియక కాదు కానీ వారు తమ అవసరమును వారి నోటితో ఆయనకు చెప్పుకొనవలెనని ఆయన ఆశించాడు.

**వచనములు 33, 34.** అందుకు ఆ గ్రుడ్డివారు, "ప్రభువా, మా కన్నులు తెరువవలెను" అన్నారు. యేసు వారిపై కనికరపడ్డాడు (చూడు 9:36; 14:14; 15:32; 18:27) గనుక ఆయన వారి కళ్లను ముట్టాడు; వెంటనే వారు దృష్టినిపొందారు. మార్కు సువార్త ప్రకారము యేసు, "నీవు వెళ్లుము; నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను" అని బర్తిమయితో చెప్పాడు (మార్కు 10:52). విశేషమేమంటే ముగ్గురు సువార్త రచయితలు కూడ ఈ గ్రుడ్డివారు (గ్రుడ్డివాడు) స్వస్థత నొందిన తరువాత యేసును వెంబడించారని చెప్పుచున్నారు (మార్కు 10:52; లూకా 18:43).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## ద్రాక్ష తోటలో పనిచేసిన వారి గూర్చిన ఉపమానము (20:1-16)

ద్రాక్ష తోటలో పనిచేసిన వారి గూర్చిన ఉపమానములో, మనకియ్యబడు ప్రతిఫలము ఏదైనా, అది కేవలము దేవుడు తన కృపనుబట్టి ఇచ్చునదే అని ఉపదేశించుటకు యేసు ప్రాచీన ఇశ్రాయేలులో సాగుచుండిన దైనందిన జీవితములోని ఒక సోదాహరణ సాదృశ్యమును ఉపయోగించుచుండెను. అది, ఆయన దృష్టి ప్రకారమైన ఒకరి యోగ్యతనుబట్టి ఇచ్చుటకు దేవునికి విశిష్ట అధికారము కలదను విషయమై యున్నది. ఇంటి యజమాని, దేవుడు; మరియు ఐదు గుంపులకు చెందిన పనివారి పట్ల వ్యవహరించుటలో ఆయన సంపూర్ణముగా న్యాయవంతుడై యుండెను, ఏలయనగా ఆయన ఏ గుంపుతో ఎలా వ్యవహరించునోయని వారికి ముందుగానే చెప్పాడో సరిగ్గా అదే విధముగా చేసాడు. అదే విధముగా, మన యెడల కూడా దేవుడు సరిగ్గా మనకు వాగ్దానము చేసిన ప్రకారమే చేయును.

వారు ద్రాక్ష తోటలో కూలికి పనిచేయవలెనని ఇంటి యజమాని వారిని పిలిచాడు. సమస్త జనులు ఆయన రాజ్యము, అనగా సంఘము లోనికి ప్రవేశింపవలెనని దేవుడు అందరికి అందజేయుచున్న ఆహ్వానమును ఈ ఉపమానము సూచించుచున్నది; గనుక విశ్వసనీయమైన వారందరు ప్రతిఫలము పొందుదురు. పొద్దున్నే వచ్చిన పనివాడు

పరలోకములో, సాయంకాలము ఐదు గంటలకు వచ్చిన పనివాని కంటె ఎక్కువ కృతజ్ఞుడై యుండునా? ఉండునని ఒకరనుకొనవచ్చును, కానీ పరలోకములో ప్రవేశించుటకు గల తరుణమును దాదాపుగా పోగొట్టుకొనినవాడు, చివరి నిమిషంలో వచ్చినవాడు, దేవుని కృపను అందరి కంటె ఎక్కువగా ప్రశంసిస్తాడు.

వారు తన సొంత ద్రాక్షతోటలో పనిచేయవలెనని ఇంటి యజమాని వారిని పిలిచాడు, కానీ తన పొరుగువాని ద్రాక్షతోటలో పనిచేయుటకు కాదు. పరలోక రాజ్యము సంఘమై యున్నది, అది నేడు కూడ ఉన్నది. ఈ రోజుల్లో పనివారి కొరకు అనేక "ద్రాక్షతోటలు" పోటిపడుచున్నవి, అయితే అవన్నీ ఒకే విధమైన ద్రాక్షతోటలు కావు. దేవుని ద్రాక్ష తోట దేవుని వాక్యములో గుర్తింపబడుచున్నది. ఆయన ద్రాక్షతోటలో పనిచేయుటకు అందజేయబడుచున్న ఆహ్వానమును అంగీకరించువారు ప్రతిఫలము పొందుదురు. ఆయన ద్రాక్షతోట గాక ఇతరమైన ద్రాక్షతోటల్లో పని చేయువారికి ప్రతిఫలము ఇవ్వబడదు. కాబట్టి మనమందరము దేవుని ద్రాక్ష తోటలో పనిచేయుచున్నామని నిశ్చయపర్చుకొనవలసి యున్నది.

ఏ ఒక్కరును దేవునితో బేరమాడలేరు. ఆయన సరైనదానినై చేయునని నమ్ముటకు మనము ఆయన వాక్యము మరియు ఆయన స్వభావముపై ఆధారపడవలెను (ఆదికాండము 18:25). "మీరు, చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా, పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంత కంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును!" అని యేసు సెలవిచ్చాడు (చూడు 7:10-11; లూకా 11:12-13). రోమీయులకు 5:9-21లో గల ఒక కీలకమైన పదజాలము "ఎంతో ఎక్కువ"యై యున్నది. దేవుడు మనకు మనము యోగ్యులమైన దాని కంటె ఎంతో ఎక్కువైన ప్రతిఫలము నిచ్చును. ఆయన న్యాయవంతుడు, కృపాబాహుళ్యముగలవాడు, ఉదార స్వభావముగలవాడు; గనుక ఆయన మనందరి పట్ల సరైన దానినే చేయును.

## ద్రాక్ష తోట ఉపమానము నేర్పించు పాఠము (20: 1-16)

19వ అధ్యాయంలోని చివరి వచనము ద్రాక్ష తోటలో పనిచేయుటకు వచ్చిన వారి గూర్చిన ఉపమానమునకు ఉపోద్ఘాతముగా ఉపయోగపడుచున్నది. ఈ ఉపమానమును మరియు అది చెప్పబడుటకు గల హేతువులను మనము సరిగా అనువదించవలెను.

*కథ చక్కగా మొదలయ్యింది.* వారు వచ్చి తన ద్రాక్షతోటలో పనిచేయవలెనని ఇంటియజమాని పనివారిని ఆ రోజున వెవ్వేరు సమయాల్లో, వెవ్వేరు ఒప్పందములతో పిలిచాడు. ఆయన చెప్పినట్లే దినాంతమందు వారికి రావలసిన మొత్తమును వారికి చెల్లించాడు.

*గమనింపబడిన కొన్ని పాఠములు.* మనము దేవునితో బేరమాడుటకు ప్రయత్నించకూడదు. అంగీకారమునకు యోగ్యమైన నియమ నిబంధనలను నియమించువాడు ఆయన ఇంకా, రాజ్యములోని ఇతర పనివారితో మనలను మనము పోల్చుకొనుటను మనము మానివేయవలెను. ఇతరుల ప్రోత్సాహకముల గూర్చిన సత్యమును మనము సందేహించకూడదు లేదా, వారిపై కుమ్మరింపబడు దీవెనల గూర్చి అసూయచెందకూడదు.

దేవుడు న్యాయవంతుడు మరియు కనికరము గలవాడు.

## పనుల యెడల వైఖరులు (20:1-16)

దేవుని రాజ్యములోని పనివారు మరియు సేవకుల వైఖరులలో తేలిన తేడాలను ఈ ఉపమానము స్పష్టముగా చూపుచున్నది. వారు అందుకొను వేతనము కొరకు మాత్రమే పనిచేయువారికి, వారు పడుచుండు పాటులో చెప్పకోదగినంత సంతోషముగాని, సంతృపిగాని ఉండదు. వారు చేయు పరిచర్య ఫలితమును లేదా నాణ్యతను ప్రశ్నించుట కష్టమైన పని కాదు.

ఎప్పుడు చూచిన గడియారము వంక చూచుచుండువారు కేవలము పనిలో ఎన్ని గంటలు గడుపుచున్నారను విషయమును మాత్రమే పట్టించుకొంటరు గనుక అంతకు మించి వారి నుండి ఆశింపబడిన దానిని లేదా చేయవలసిన దానిని చేయుటకు వారు ఇష్టపడరు. ఇంకా కొందరేమో, పనివారైన ఇతరులనే గమనించుచుందురు. అలా ఇతరులు చేయుచుండు పనులను గమనించి, వారు చేయవలసినంత ఉత్తమంగ చేయుటకు బదులుగా, తోటిపనివారు చేసిన దానితో వారి పనులను పోల్చుచుందురు. ఇతరులకే ఎక్కువ గౌరవము లేక మర్యాద ఇవ్వబడుచున్నదని, లేక వారికి ఎక్కువ మొత్తము చెల్లింపబడుచున్నదని, మంచి పదవులు వారికే అంటగట్టబడుచున్నవని, లేక మంచి సౌకర్యములు వారికే కల్పింపబడుచున్నవని వారనుకొన్నట్లయితే, వారు ఆగ్రహముతో తమ అయిష్టమును ప్రదర్శించుదురు.

అనేక మంది పనివారు వారి పనుల్లో ఆనందించుదురు గనుక తద్వారా వారు ఉన్నతమైన సంతృప్తిని పొందుదురు. వారు సాధించిన పనుల గూర్చి లేదా తయారు చేసిన ఉత్పత్తుల గూర్చి గర్విస్తారు. “ఈ పని చేయుచున్నందుకు నాకు డబ్బులు ఇవ్వబడకున్నా కూడ, నేనీపని చేసిముగిస్తాను” అని కొన్ని పర్యాయములు వారు చెప్పుకొందురు. కొందరు వారి నుండి కోరబడిన దాని కంటె ఎక్కువ చేయుదురు. వారికి, పని ఒక ఉద్యోగము కాదు, కానీ ఒక రాయబారమై యున్నది. వారు తోటి పనివారి సఫలతను మెచ్చుకొనుచు, వారు సాధించిన విషయాలనుబట్టి వారితో కూడ సంతోషించుదురు.

## ప్రాముఖ్యతనా లేక పరిచర్యనా? (20:20-28)

యాకోబు మరియు యోహానుల తల్లి యేసు యొద్దకు స్వార్థముతో కూడిన మనవితో వచ్చింది. తన కుమారులు ఆయన రాజ్యములో ఆయన కుడి వైపున ఒకరు, ఎడమ వైపున మరొకరు కూర్చుండవలెనని సలోమే ఆయనను మనవి చేసింది. వారందరు పన్నెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పన్నెండు గోత్రముల వారికి తీర్పు తీర్చుట గూర్చి యేసు పేతురుతో చెప్పిన మాటలు సలోమేను ప్రోత్సాహించి యుండవచ్చును. వారడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరముగా యేసు వారికి బోధించాడు/అసలైన గొప్పతనమేమిటో, పరిచారకుడై యుండుట అనగా నేమిటో ఆయన వారికి బోధించాడు.

*తన ఇరువురు తనయుల గూర్చిన ఒక తల్లి గర్వము* (20:20-23). యాకోబు మరియు యోహానుల యొక్క గర్వింపదగిన తల్లిగా, రాజ్యములో తన కుమారులకు ప్రధానమైన స్థానములియ్యబడవలెనని సలోమే అడుగుచుండినది. అయితే ఆమె అడుగుచుండినదేమిటో ఆమెకు తెలియలేదని సలోమే కోరికకు యేసు ఇచ్చిన సమాధానము చెప్పుచున్నది.

*ఆగ్రహము చెందిన పదిమంది అధ్యాపకులు* (20:24-28). మిగిలిన పది మంది

అపొస్తలులు ఎందుకు కోపపడ్డారు? తోటి అపొస్తలులు వారి కంటె ఉన్నతమైన స్థానములలో ఉంచబడవలెనను ఆలోచనను వారు ఇష్టపడలేదు. ఊరకనే ఉబ్బిపోయిన ఈ ప్రబోధకుల ఉబలాటమును యేసు పూర్తిగా తగ్గించేసాడు. పరిచర్య గూర్చిన ప్రధాన సూత్రమును ఆయన తన సొంత మాదిరితో సోదాహరణముగా వర్ణించాడు/ఆయన పరిచారము చేయుటకును, చివరకు పాపుల కొరకు విమోచన క్రయధనముగా తన ప్రాణము నర్పించుటకును వచ్చాడు.

## పెద్దలు మరియు ముఖ్య పదవులు (20:20–28)

ఆయన రాజ్యములో ముఖ్య పదవులు అంటూ ఏమియు లేవను విషయాన్ని యేసు యాకోబు మరియు యోహానుల తల్లికిని, ఆ ఇద్దరు అపొస్తలులకును సుస్పష్టము గావించాడు (మార్కు 10:38–40). అది ఈ లోక రాజ్యములు పనిచేయుచుండు తీరైయున్నది, ఒకే వ్యక్తి ఇతరులందరిపై "ప్రభుత్వము చేయుచుండును." సంఘమును పెద్దలు "ఏలుదురు" (1 తిమోతి 5:17; హెబ్రీయులకు 13:7, 17), కానీ వారు "వారికి అప్పగింపబడినవారిపైన ప్రభువులైనట్టుండక" మందకు మాదిరులుగా ఏలవలెను (1 పేతురు 5:3–4). అలాగైతే, వారు ఏ అవగాహన చొప్పున ఏలుదురు? "ఏలుట" అనగా, "నడిపించుట, మార్గనిర్దేశనము నిచ్చుట" అని అర్థము. విశ్వాస సంబంధమైన విషయములలో, పెద్దలకు చట్టపరమైన అధికారము లేదు. ధర్మశాస్త్రమును నియమించి దానిని విధించువాడు దేవుడు మాత్రమే (యాకోబు 4:12). ఒక సంఘ నాయకుడు ఏది సత్యమో ఏది అసత్యయమో నిర్ధారించు తెలివిగలవాడై యుండి ఆయన కాపరత్వమునకు అప్పగింపబడిన సంఘమునకు మార్గనిర్దేశనము నిచ్చుచుండవలెను. ప్రయోజనకారిత్వము లేక తీర్పుల విషయములలో, సరైన తీర్మానము చేయుటకు అతడు లేఖనానుసారమైన నియమములను ఉపయోగించగలవాడై యుండవలెను.

## దాసత్వ నాయకత్వము (20:20–28)

వారి స్వప్రయోజనార్థమై ఇతరులపై అధికారమును వినియోగించిన అన్యజనుల నాయకత్వ విధానమును యేసు ఖండించాడు. దీనికి తారతమ్యముగా, వారు పరిచర్య చేయు పథములో పయనించుచుండవలెనని ఆయన తన సొంత శిష్యులకు పిలుపు నిచ్చాడు. ఈ రోజుల్లో అనేకులు విజయ సోపానములను ఎక్కుచు ఉన్నత స్థితిలోనికి వీలైనంత త్వరలో చేరుకొనవలెనని, ఇంత కంటె గొప్ప బిరుదులు సంపాదించుకొనవలెనని, ప్రజల్లో వారే ప్రధానమైనవారని మరి ఎక్కువగా గుర్తింపబడవలెనని వెదకుచున్నారు. అవే వారి వృత్తులయ్యాయి. దానికి మారుగా, మనము ఇతరులకు సహాయము చేయుటపై మన దృష్టిని కేంద్రీకరించవలెనని యేసు కోరుచున్నాడు. ఇతరుల జీవితములకు ఆశీర్వాదకరముగా ఉంటూ వారిని యేసు యొద్దకు నడిపించుట ద్వారా మనము జీవితము యొక్క అసలు అర్థమును సార్థకము చేసికొనగలము. జీవితము, వాస్తవమునకు మనల గూర్చినది కాదు, కానీ అది మనము మన మనుగడ చేత ఈ లోకములో కలుగజేయగల మార్పై యున్నది.

డేవిడ్ స్టూవర్ట్

## సూచనలు

[1]Talmud Baba *Metzia* 83b. [2]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans, Publishing Co., 1992), 499, n.5. [3]రోమా ప్రభుత్వ దేనారము విలువ ఒక గ్రీకు డ్రాక్మాకు సమానమైనదై యుండినది. అపొక్రిఫలో, ఒకనికి వారి దిన కూలీగా ఒక డ్రాక్మా చెల్లింపబడినది, మరియు ఆ నాటి వాని ఖర్చులు కూడ ఇవ్వబడినది. (Tobit 5:14, 15). [4]Tacitus *Annals* 1.17; Pliny *Natural History* 33.13. [5]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 121. [6]Morris, 500. [7]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew,* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 739. [8]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 398. [9]David Hill, *The Gospel of Matthew, the New Century Bible Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Hill, Publishing Co., 1972), 286. [10]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of the Chicago Press, 2000), 398.

[11]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 483, n. 72. చూడు Demosthenes *On the Crown* 51; Dionysius of Halicarnassus 6.81.3. [12]అసంతృప్తిని ప్రదర్శించు అసూయతో కూడిన వైఖరి కూడ పరిసయ్యుల, అనగా సుంకరులు మరియు పాపులు మారుమనస్సు నొందుచుండినందుకు సణుగుచుండినవారి, ఆదర్శప్రాయమై యుండినది (లూకా 15:1, 2). తత్ఫలితంగా, యేసు తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానము చెప్పుచు, వాని అన్న యొక్క ఈర్ష్యను బట్టబయలు చేసాడు. అటుతరువాత, సంఘము స్థాపింపబడిన తదుపరి, అన్యజనులై యుండి యేసు క్రీస్తునందు విశ్వసించుచుండిన వారి యెడల, వారికుండిన వైఖరితో యూదులై యుండిన క్రైస్తవులు ఎంతో ప్రయాసపడుచుండిరి. (అపొస్తలుల కార్యములు 15; గలతీయులకు 2). [13]Donald A. Haggner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 573. [14]యేసు మరియు తన శిష్యులు రూపాంతర కొండ మీది నుండి దిగివచ్చుచుండగా, శిష్యులలో ఆయనకు సన్నిహితులై యుండినవారి (పేతురు, యాకోబు, మరియు యోహాను) విషయమై ఆయన కలిగియుండిన ప్రగాఢ వాంచ గూర్చి కూడ ప్రభువైన యేసు క్రీస్తు తెలియజెప్పాడు (17:9–13). [15]Mishnah *Sanhedrin* 7.1. [16]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 183. [17]యేసు అపొస్తలుడైన యోహానును, తన తల్లి సహోదరి కుమారుని, నమ్మి అతనికి తన తల్లియైన మరియ బాధ్యతను ఒప్పగించుటకు గల హేతువును ఈ సంబంధము కొంత వరకు వివరించుచున్నది (యోహాను 19:26, 27). [18]Wilkins, 123. [19]Josephus *Antiquities* 6.11.9; చూడు 1 సమూయేలు 20:25. [20]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1 *Matthew and Mark* (N.p., 1857; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 176.

[21]Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament,* 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 42; చూడు KJV; NKJV. [22]Pliny *Natural History* 4.12.69-70; Tacitus *Annals* 3.68; 4.30; 15.71. [23]Irenaeus *Against Heresies* 2.22.5; 3.1.1; 3.3.4; Clement of Alexandria *Who Is a Rich Man* 42; Eusebius *Ecclesiastical History* 3.13, 18, 23, 31; 4.14; 5.8, 24. [24]Keener, 486-87. [25]ఆయనను అన్యజనులు హేళన చేయుదురు, కొరడా దెబ్బలు కొట్టుదురు, మరియు సిలువవేయుదురని యేసు కొద్ది నిమిషాల క్రితమే ప్రవచించుచు పలికాడు (20:19). వారి అన్యాయమునకు ఆయన తానే ఒక బలిపశువయ్యాడు. [26]Wilkins, 124. [27]Ibid. [28]F. Buchsel, in *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 4:344. [29]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 81. [30]W. F. Albright and C. S. Mann, *Matthew,* The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 242.

[31]Wilkins, 125. [32]“చుట్టి వ్యాపించి యుండిన వాతావరణము ఇచ్చట కూడ ఎంతో అనువైన ఉష్ణోగ్రతలో ఉన్నది, గనుకనే ఆ దేశ ప్రజలు కేవలము నారబట్టలు మాత్రమే ధరించియున్నారు, ఇంకా మిగిలిన యూదయ ప్రాంతమంతయు మంచుతో కప్పబడి యున్నదని” జోసీఫస్ రచించాడు. (Josephus *Wars* 4.8.3). [33]Ibid., 1.18.5. [34]Hendriksen, 752.